

ఆరు రోజుల్లో.. అన్న క్యాంటీన్లు

- పేదల ఆకలి తీర్చేందుకు సిద్ధమవుతున్నాయి
- పురపాలక సంఘాల ఆధ్వర్యంలో శరవేగంగా పనులు
- వైసీపీ పాడుపెట్టగా.. కూటమి ప్రభుత్వం పునరుద్ధరణ
- తుది దశలో పనులు.. 15న ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- పేదల ఆహార భద్రతకు కట్టుబడిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలి విడతలో 26 క్యాంటీన్ల పునరుద్ధరణ



బాపట్లలో ముస్తాబైన అన్న క్యాంటిన్

ఆకలితో ఎవరూ ఉండకూడదు.. తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం పేదలకు అందుబాటులో ఉండాలి.. అనే సదాశయంతో గత టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసింది. అయితే పేదల కడుపు నింపిన అన్న క్యాంటీన్లను 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పాడుపెట్టింది. ఎన్ని విమర్శలు వచ్చినా జగన్ ప్రభుత్వం అన్న క్యాంటీన్లపై స్పందించలేదు. వైసీపీ ప్రభుత్వం పేదల కడుపు కొట్టగా నేటి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై దృష్టి సారించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించాలని నిర్ణయించింది. ఆ దిశగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలివిడతలో ఎంపిక చేసిన అన్న కాంట్యీన్ల ప్రారంభానికి అధికారులు శరవేగంగా పనులు చేపట్టారు. తుది దశకు ఆయా పనులు చేరగా ఇక ఆరు రోజుల్లో అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నాయి. మున్సిపాలిటీల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులను ఇటీవల మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా పరిశీలించారు. అన్న క్యాంటీన్లు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయా అని పేదలతో పాటు సామాన్యులు, దిన సరి కూలీలు ఎదురుచూస్తున్నారు.

(గుంటూరు, నరసరావుపేట - ఆంధ్రజ్యోతి, బాపట్ల, తెనాలి, మాచర్ల, మారీసుపేట)

మరో ఆరు రోజుల్లో.. తక్కువ ధరకు నాణ్యమైన ఆహారంతో పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం పాడుబెట్టిన అన్న క్యాంటీన్ భవనాలను అధికారులు పునరుద్ధరించారు. అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తామని పేదలకు ఇచ్చిన ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు అన్న క్యాంటీన్‌లు సిద్ధమయ్యాయి. గతంలో ఎలా ఉన్నాయో అలానే క్యాంటీన్ భవనాలను పునరుద్ధరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న 26 క్యాంటీన్ల పునరుద్ధరణ పనులను మున్సిపాల్టీలు చేపట్టాయి. గడిచిన నెలరోజులుగా నిర్వహిస్తున్న మరమ్మతు పనులు తుది దశకు చేరుకున్నాయి. కొన్ని చోట్ల పనులు పూర్తై భవనాలు కొత్త కళను సంతరించుకున్నాయి. విద్యుత్ సరఫరా, కొత్త పరికరాలు, సాఫ్ట్‌వేర్ సమీకరణ వంటి మౌలిక సదుపాయాల పనులు వేగంగా జరుగుతున్నాయి. రెండు మూడు రోజుల్లో అన్న క్యాంటీన్లన్నీ కొత్త శోభగులతో సిద్ధం కానున్నాయి. అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణ పనులను పేదలు వచ్చి ఆశక్తిగా పరిశీలిస్తున్నారు. 15న ప్రారంభానికి సిద్ధమవుతుండటంతో పేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ తమ ఆకలి తీర్చేందుకు క్యాంటీన్‌లు ప్రాంభించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని పేదలు అయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. క్యాంటీన్ల ద్వారా ఒక్కొక్క చోట ఐదు వందల మందికి అల్పాహారం, భోజనం అందించే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అల్పాహారం ఇడ్లీ, పూరి, ఉప్మా ఇలా రోజుకొక రకం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. భోజనంలో ఒక కూర, సాంబారు, పెరుగు, రైస్ వడ్డించనున్నారు.

- **నాడు ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్లు**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో వేలాది మంది పట్టణ పేదల ఆకలి తీర్చేందుకు టీడీపీ ప్రభుత్వం 2018 జూలై 11న అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. జిల్లాలోని 13 నగర, పుర పాలక సంఘాల్లో మొ త్తం 29 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ప్రతి రోజూ వేలాది మంది పట్టణ పేదలకు 5 రూపాయ లకే టిఫిన్, భోజనం లభించేది. కేవలం 15 రూపాయలతో ఒక పేద వాడికి రోజు గడిచి పోయేది. నగర, పట్టణ ప్రాంతాల్లో ఉండే అభా గ్యులు హాయిగా కడుపు నింపుకునేవారు. భిక్షాటకులకు అన్న క్యాంటీన్ ఒక వరంలా మారా యి. ఆకలితో పస్తులుండాల్సిన బాధ వారికి తప్పింది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చే దిన కూలీలు, రైతులు, చిరు వ్యాపారులు, విద్యార్థులకు కూడా అన్న క్యాంటీన్లు ఆకలి తీర్చేవి. అలాంటి అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసింది. అయినా టీడీపీ శ్రేణులు వీలైన ప్రతి చోటా తమసొంత డబ్బులు ఖర్చు చేసి అన్నా క్యాంటీన్లను నిర్వహించారు. దానికి కొనసాగింపుగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు నెలల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభించి పేదల ఆకలితీర్చేందుకు పూనుకుంది.

- తెనాలిలో మున్సిపల్ కార్యాలయం ఎదుట, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, జిల్లా ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో అన్నక్యాంటీన్ల పనులను మున్సిపల్ అధికారులు పూర్తి చేస్తున్నారు.
- బాపట్లలోని సూర్యలంకరోడ్డులో పాతకోర్టు భవనం పక్కనే 2018లో అప్పటి ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్ రూ.36లక్షల వెచ్చించి అన్నక్యాంటిన్ భవనాన్ని నిర్మించగా వైసీపీ ప్రభుత్వంలో శిథిలావస్థకు చేరింది. దీనిని రూ.10 లక్షలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అధునాతన హంగులతో రూపుదిద్దుకున్న అన్నక్యాంటిన్‌ను ఈ నెల 15న ప్రారంభించేందుకు సిద్ధం చేశారు.
- గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో 8 అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు. నగరంలోని వ్యవసాయ కార్యాలయం, అమరావతి రోడ్డులోని ఐడీ ఆస్పత్రి, జేకేసీ కళాశాల రోడ్డులోని టీడీసీ కార్యాలయం, యార్డు, నల్లచెరువు వాటర్‌ట్యాంకు, గుంటూరు బస్టాండు, మార్కెట్ సెంటర్లోని పల్నాడు బ స్టాండ్ సెంటర్, పెద కూరపాడు రోడ్డులో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో గుంటూరు బస్టాండు, పల్నాడు బస్టాండు వద్ద ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ల పనులు పూర్తయ్యాయి. మంగళగిరి పాత బస్టాండు, తాడేపల్లి, ఉండవల్లిలోని సీఎం ఇంటి వద్ద, రాష్ట్ర సచివాలయం వద్ద అన్న క్యాంటీన్లు పునఃప్రారంభానికి సిద్ధమయ్యాయి. మిగిలిన క్యాంటీన్లను సెప్టెం బరు 21 లోగా ప్రారంభిస్తామని ప్రభుత్వం చెబుతోంది.



రేపల్లెలో సిద్ధమైన అన్న క్యాంటిన్



గుండెపోటుకు చెక్

- హార్ట్‌స్ట్రోక్ మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
- హార్ట్ కేర్ హబ్‌గా గుంటూరు జీజీహెచ్ ఎంపిక
- సామాన్యుల కోసం రాష్ట్ర ప్రభుత్వం హార్ట్ కేర్ సర్వీసులు
- సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఖరీదైన టెనెక్ట్ ప్లేస్ ఇంజక్షన్లు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 స్పోక్స్ సెంటర్ల ఏర్పాటుకు అనుమతి


గుండెపోటు.. ఎప్పుడు ఎలా ఎవరికి వస్తుందో తెలియదు. సకాలంలో చికిత్స చేయించుకోలేక ఎందరో మరణిస్తుంటారు. ఖరీదైన ఈ వైద్యం సామాన్యులకు అందుబాటులో లేదు. పైగా గుండెపోటు మరణాలు అధికమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గుండెపోటు మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. గుండెపోటు వచ్చిన వారికి మొదటి గంట చాలా కీలకం. ఆ సమయంలో ప్రాథమిక చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు. అందుకు చాలా ఖర్చు అవుతుంది. ఆ ఖర్చును భరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నడుంకట్టింది.

గుంటూరు సిటీ, ఆగస్టు 9: గుండెపోటు వచ్చిన వారి ప్రాణాలు కాపాడే అతి ఖరీదైన ఇంజక్షన్ సామాన్యులకు అందుబాటులో తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు అనుమతి ఇచ్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారు ఎక్కువగా ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లాను హార్ట్ కేర్ పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేశారు. అందులో భాగంగా జీజీహెచ్‌ను హార్ట్ కేర్ హబ్‌గా మార్చనున్నారు. గుండెపోటు సంభవించిన తొలి గంటను గోల్డెన్ అవర్ అని వైద్యులు చెబుతారు. ఆ తొలి గంటలో చేసే ప్రాథమిక వైద్యం రోగికి ప్రాణం పోస్తుంది. ప్రస్తుతం గుండెపోటు వచ్చిన వారికి టెనెక్ట్ ప్లేస్ అనే ఇంజెక్షన్ ఇస్తున్నారు. ఈ ఇంజె క్షన్‌కు గడ్డ కట్టిన రక్తాన్ని కరిగించే శక్తి ఉం టుంది. దీని విలువ సుమారు రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుంది. చాలా సందర్భాల్లో ఆ ఖర్చు భరించలేక సామాన్యు లు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆ పరిస్థితిని నివారించేందుకు ప్రభుత్వం టెనెక్ట్ ప్లేస్ ఇంజెక్షన్‌ను సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. స్పోక్స్ సెంటర్లలో టెనెక్ట్ ప్లేస్ ఇంజక్షన్ ఉచితంగా ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 స్పోక్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గుండె పోటు వచ్చిన వారికి ఆయువు పోసే ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉంచనున్నారు. ఆయా సామాజిక ఆరోగ్య కేంద్రాలను గుండె పోటు బాధితులు ఉండేందుకు తగ్గట్లుగా తీర్చిదిద్దనున్నారు. అక్కడ ప్రాథమిక చికిత్సలో భాగంగా టెనెక్ట్ ప్లేస్ ఇంజెక్షన్ ఇచ్చి పరిస్థితి స్టేబుల్ చేసిన తర్వాత జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తారు. ఆయా స్పోక్స్ సెంటర్ల నుంచి వచ్చే కేసులను అత్యంత ఎమర్జెన్సీగా భావించి వారికి అవసరమైన ఏంజియో గ్రామ్, స్టెంట్ ప్రక్రియను ప్రారంభిస్తారు.

గుంటూరే కీలకం

ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు ప్రకారం గుంటూరు, నెల్లూరు, వైజాగ్, కడప జిల్లాల్లో మాత్రమే గుండెపోటు మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. గుంటూరు జిల్లాలో అసంక్రమిత వ్యాధుల్లో ఎక్కువ శాతం మరణాలు గుండెపోటు వల్లే జరుగుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక చెబుతోంది. ఈ జిల్లాలో 49 సంవత్సరాల వయస్సు లోపు ఎక్కువ మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు. 60 సంవత్సరాల వయస్సు తర్వాత మొత్తం గుండె జబ్బుల కేసుల్లో 21 నుంచి 25 శాతం మాత్రమే ఉంటున్నాయి. జిల్లాలో సంభవిస్తున్న మరణాల్లో 31 శాతం గుండె పోటు వల్లే ఉంటున్నాయి. వారిలో 75 శాతం మంది పేద, మధ్యతరగతి వర్గాలు ఎక్కువ గా ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఆయా వర్గాలకు టెనెక్ట్ ప్లేస్ ఇంజెక్షన్ అందుబాటు లోకి రావడం వల్ల మధ్యంతర మరణాలు నివారించవచ్చునని కూటమి ప్రభుత్వం ఖర్చుతో కూడిన వైద్యానికి శ్రీకారం చుట్టింది. గుండెపోటుకు గురై మరణించే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలోనే కార్డియాలజీ, కార్డియో వాస్కులర్ సేవలను మరింతగా విస్తృతం చేసి, ప్రజలకు చేరువ చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు స్పష్టం అవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఫ్యామిలీ డాక్టర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ వ్యవస్థను వినియోగించి గుండెపోటు లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తారు. గుండెపోటుకు గురైన వ్యక్తిని గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా సమీపంలోని స్పోక్స్ సెంటర్‌కు తరలిస్తారు. అవసరమైన సిబ్బందిని కూడా నియమించే అవకాశం ఉంది.





12 మంది ఎస్ఐల బదిలీ.. వీఆర్‌కు ఆరుగురు

బాపట్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెద్ద ఎత్తున పోలీసు అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం ఆదేశాలు వెలువడ్డాయి. సీఐలకు సంబంధించి జిల్లాలో గురు, శుక్రవారాల్లోనే ఐదుగురికి పోస్టింగ్ ఇస్తూ గుంటూరు రేంజి ఐజీ ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఐల విషయానికి వస్తే ఒకేసారి 12 మందికి స్థానచలనం కలిగించగా, ఆరుగురిని వీఆర్‌కు పంపిస్తూ ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాలిచ్చారు. నిజాంపట్నం, భట్టిప్రోలు, బల్లికురవ, చినగంజాం, ఇంకొల్లు, ఈపూరుపాలెం ఎస్ఐలను వీఆర్‌కు పంపించారు. ఈపూరుపాలెం పరిధిలో జరుగుతున్న వరుస నేరాల పరంపర కూడా సదరు ఎస్ఐను వీఆర్‌కు పంపడానికి కారణంగా ఉన్నట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున జరిగిన సీఐలు, ఎస్ఐల బదిలీల విషయంలో రాజకీయ సిఫారసులే కొలమానంగా జరిగినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి దాదాపుగా రెండు నెలల వ్యవధి తర్వాత కానీ పోలీస్ అధికారుల పోస్టింగ్ విషయంలో స్పష్టత వచ్చింది. ఇంత వ్యవధి తీసుకోవడం పట్ల పోలీసు వర్గాల్లోనే ఓ దశలో అసంతృప్తి వ్యక్తమైంది. ఈ జాప్యం వెనక నేతల సిఫారసులే కారణంగా ఉంది.

జెండా ఆవిష్కరణపై స్పష్టత

జిల్లాలకు మంత్రులను కేటాయించిన ప్రభుత్వం

- గుంటూరులో లోకేశ్, పల్నాడులో మనోహర్, బాపట్లలో రవిలకు అవకాశం







గుంటూరు సిటీ/ నరసరావుపేట, బాపట్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తోంది. జిల్లా కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారులు ఇప్పటికే దృష్టి సారించారు. వేడుకల ఏర్పాట్లపై యంత్రాంగం సమీక్షిస్తోంది. స్వాతంత్ర్య వేడుకల్లో ఇన్‌చార్జి మంత్రి పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. అయితే కూటమి ప్రభుత్వం ఇన్‌చార్జి మంత్రుల నియామకం చేయలేదు. దీంతో జెండా ఆవిష్కరణ చేసే మంత్రులపై సందిగ్ధత నెలకొంది. ఈ పరిస్థితుల్లో జెండా ఆవిష్కరణలో పాల్గొనే అమాత్యుల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఆగస్టు 15న జిల్లాల్లో జెండా వందనం చేసే మంత్రుల జాబితా శుక్రవారం ఖరారైంది. గుంటూరు జిల్లాలో మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, పల్నాడు జిల్లాలో ఆహార, పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, బాపట్ల జిల్లా లో ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ జెండా వందనం చేయను న్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి హోదాలో నాదెండ్ల మనోహర్ గతంలో జాతీయ జెండాను ఆవిష్కరించగా నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్ మంత్రుల హోదాలో జెండా వందన కార్యక్రమాల్లో పాల్గొనడం ఇదే మొదటిసారి. నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి మనోహర్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

గుంటూరుదే ఆ ఘనత

రాజకీయ చైతన్యానికి మారుపేరైన గుంటూరు జిల్లా కేంద్రంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన వారిలో రాజకీయ ఉద్దండులు ఉన్నారు. ఇక్కడ జాతీయ జెండాను ఆవిష్కరించిన వారు తర్వాత కాలంలో ముఖ్యమంత్రులు కూడా అయ్యారు. ఇది గుంటూరుకు ఓ ప్రత్యేక ఘనతగా కొనసాగింది. కాసు బ్రహ్మానందరెడ్డి, భవనం వెంకట్రామిరెడ్డి, కొణిజేటి రోశయ్య అప్పట్లో జిల్లా మంత్రుల హోదాలో గుంటూరులో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆ తర్వాత కాలంలో వారు ముఖ్యమంత్రులుగా రాష్ట్ర రాజధానిలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన గుంటూరు జిల్లా కేంద్రంలో మంత్రి లోకేశ్‌కు ఈసారి జాతీయ జెండా ఆవిష్కరించే అవకాశం దక్కింది.

రేంజిలో మరికొందరు సీఐల బదిలీ

సత్తెనపల్లి పోస్టింగ్‌పై కూటమి శ్రేణుల గగ్గోలు ● ఆ సీఐ మా కొద్దంటూ స్థానిక నేతలకు వినతులు

గుంటూరు, ఆగస్టు 9: గుంటూరు రేంజ్ పరిధిలో మరికొందరు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గడిచిన కొద్దిరోజులుగా బదిలీల ప్రక్రియ కొనసాగు తున్న విషయం విధితమే. తాజాగా బదిలీ అయిన వారిలో ప్రకాశం జిల్లా పామూరు సీఐ ఎం రామానాయక్‌ను వట్టిచెరుకూరుకు, సీఐడీలో ఉన్న ఎన్ కిశోర్‌బాబును గూడూరు రూరల్‌కు, మద్ది శ్రీనివాసరావును నెల్లూరు త్రీ టౌన్‌కు బదిలీ చేశారు. వెంకటగిరిలో విధులు నిర్వహిస్తున్న ఎన్ సంగమేశ్వరరావును నాయుడు పేట రూరల్‌కు, ప్రకాశం జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ విభా గంలో ఉన్న ఏ వెంకటరమణను వెంకటగిరికి, ఏసీబీ లో ఉన్న జీఎల్ శ్రీనివాసరావును మార్టూరుకు, వీఆర్ లో ఉన్న వైవీ రమణయ్యను ఇంకొల్లుకు, వై పాండు రంగారావును ఒంగోలు ట్రాఫిక్‌కి, బీ హరికృష్ణను బాపట్ల రూరల్‌కు, నెల్లూరు సీసీఎస్‌లో విధులు నిర్వ హిస్తున్న కామరాజు గడ్డ సాంబశివరావును నెల్లూరు ఆరో టౌన్ సీఐగా బదిలీ అయ్యారు.

సత్తెనపల్లి టౌన్ సీఐ పోస్టింగ్ వివాదాస్పదం

ఇటీవల సీఐల నియామకం వివాదాస్పదమవుతున్న తరుణంలో తాజాగా సత్తెనపల్లిలోనూ మరో సీఐ వ్యవహారం తెరపైకి వచ్చింది. సత్తెనపల్లి టౌన్ సీఐ గా సీహెచ్ సీతారామయ్య నియామకానికి మార్గం సుగమమైనట్లు కూటమి పార్టీ శ్రేణుల దృష్టికి వచ్చింది. దీంతో ఆ సీఐ తమకు వద్దంటూ టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు స్థానిక నేతల దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. గతంలో గుంటూరు నగరంతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలో పనిచేసిన సమయంలో పలు ఆరోపణలతో ఆయన సస్పెన్షన్ అయ్యారని వారు నేతల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. వైసీపీ నాయకులతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారని, వివాదాస్పద సీఐగా పేరున్న ఆయనకు పోస్టింగ్ ఇస్తే పార్టీకి, ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వస్తుందని నేతలు వాపోతున్నారు. అయితే ఆ సీఐ వల్ల ఇబ్బంది రాకుండా చూసుకుంటానని నేతలు హామీ ఇచ్చినా కార్యకర్తలు ససేమిరా అంటున్నారు. సత్తెనపల్లిలో ఆయ నకు పోస్టింగ్ ఇవ్వాలని గత ఎన్నికల్లో గుంటూరు పశ్చిమలో వైసీపీ అభ్యర్థి తరపున ప్రచారం చేసిన ఓ నాయకుడు ఒత్తిడి చేస్తుండటం మరింత వివాదాస్పదమైంది. ఈ విషయం స్థానిక నేతలకు తలనొప్పిగా మారే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు వాపోతున్నాయి. మరో వైపు ఈ వ్యవహారంపై టీడీపీ శ్రేణులు అధిష్ఠానానికి కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆ సీఐ వ్యవహారంపై అధిష్ఠా నం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.



శ్రావణమాసాన్ని పురస్కరించుకొని తొలి శుక్ర వారం రోజున చండోలులోని అమ్మవారి దేవస్థానంలో శ్రీబగళాముఖి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. - **పిట్టలవానిపాలెం**

గిరిజనుల జీవితాల్లో వెలుగుల కోసం కృషి

ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 9: గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. తొలుత గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో ఏకలవ్యుడు, చెంచులక్ష్మి, డాక్టర్ అంబేద్కర్, సేవాలాల్ మహారాజు, వెన్నెలగంటి రాఘవయ్యల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. సభలో కలెక్టర్ మాట్లాడుతూ బాపట్లజిల్లాలో 75 వేల మంది ఆదివాసీలు ఉన్నట్లు చెప్పారు. 2040 నాటికి సికిల్‌సెల్ ఎనిమియా రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆధార్, జనన ధ్రువీకరణపత్రాల జారీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండయ్య మాట్లాడు తూ గిరిజనుల సంక్షేమానికి చేయూత అందిస్తానని హామీ ఇచ్చారు. యాభై ఏళ్లు నిండిన ఎస్టీలకు పింఛన్‌పై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. టీడీపీ ఆవిర్భావించిన తొలి రోజుల్లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చెంచుల కోసం ప్రత్యేకకాలనీలను నిర్మించారన్నారు. కార్యక్రమంలో శాసనమండలి చీఫ్‌విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, డీఆర్వో సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్, జిల్లా సంక్షేమశాఖాధికారి జె.రాజాదెబోరా, గిరిజన నాయకులు మోహన్‌కుమార్ ధర్మా, డాక్టర్ జి.చార్వాక, తిరువీధుల శంకర్‌ప్రసాద్, రాఘవయ్య, డి.బ్రహ్మం, శీలం, రోజన్‌బాబు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

కార్బన్ ఉద్గారాల రహితంగా ఆక్వా

బాపట్ల, ఆగస్టు 9: కార్బన్ ఉద్గారాల రహితంగా ఆక్వా ఉత్పత్తులు సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న కార్బన్ ఉద్గారాల పరిమాణం కనీసం 30 శాతం తగ్గించాలని నిర్ణయించింది. జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలని పర్యావరణ సమతుల్యతను పాటిస్తూ నూతన సాంకేతిక పద్ధతులను ఉపయోగించి స్థిరమైన ఆక్వా ఉత్పత్తులు సాధించాలని ధ్యేయంగా పెట్టుకుంది. ఈ క్రమంలో స్నేహపూర్వక ఆక్వా ఉత్పత్తులను సాధించటానికి రాష్ట్రానికి రూ.107 కోట్లను మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల బృందం శుక్రవారం జిల్లాలోని ఆక్వాపరిశ్రమలను పరిశీలించి కలెక్టర్ జె.వెంకటమురళికి నివేదిక అందజేసింది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డాక్టర్ కొండా చవ్వ, జాతీయ జీవవైవిధ్య నిపుణులు సీమాభట్, సాంకేతిక నిపుణులు మురళీధరన్, ఆక్వాకల్చర్ స్పెషలిస్ట్ విష్ణుభట్, పర్యావరణ ప్రతినిధి సీనాకోషి, బాగస్వామ్య లింగపరిరక్షకురాలు సాలోమ్‌ఏసుదాసు, మత్స్యశాఖ అదనపు సంచాలకులు ఏంజలి, జిల్లా మత్స్యశాఖాధికారి డాక్టర్ పి.సురేష్, సిబ్బంది కలెక్టర్‌ను కలిసి వివరాలను అందజేశారు.



ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను కలెక్టర్ జె.వెంకటమురళీకి వివరిస్తున్న నిపుణుల బృందం

దిక్సూచి DIKSUCHI

మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.



ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్

తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు

- డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.
- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.

అర్హత వివరాలు

- డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్

- టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సులో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్, ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి/ఇంటర్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఆదాయ ధ్రువీకరణ పత్రం; సంబంధిత కోర్సులో అడ్మిషన్ పొందిన లెటర్; ట్యూషన్ ఫీజు రిసీట్; ఆధార్ లింక్‌తో ఉన్న బ్యాంక్ ఖాతా నంబర్; ఐఎఫ్ఎస్సీ కోడ్; కుల ధృవీకరణ పత్రం; ఆధార్ కార్డ్; అభ్యర్థి ఫొటో
- **ఇన్‌స్టిట్యూట్ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 15
- **డీఎన్‌ఓ/ఎస్ఎన్‌ఓ/ఎంఎన్‌ఓ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

జేఎన్‌టీయూ హెచ్‌లో స్పాట్ అడ్మిషన్స్



హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్(డీయూఎఫ్ఆర్)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో విదేశీ కోటా కింద మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో సీట్లు అలాట్ చేస్తారు. ఎఫ్ఎన్/పీఐఓ/సీఐడబ్ల్యూజీ/ఎన్ఆర్ఐ కేటగిరీల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్దేశిత ఫీజులతో క్యాంపస్‌కు హాజరు కావాలి.

నాలుగేళ్ల బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ-ఏఐఎంఎల్ 6, సీఎస్ఈ-సైబర్ సెక్యూరిటీ 5, ఈసీఈ 4, ఈఈఈ 6, మెకానికల్ 6, సివిల్ 6, కెమికల్ 6, మెటలర్జీ 8, బయోటెక్నాలజీ 6, జియో ఇన్ఫర్మాటిక్స్ 8 సీట్లు చొప్పున మొత్తం 61 సీట్లు ఉన్నాయి.

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ విభాగాల్లో ఒక్కోదానిలో 5 సీట్లు చొప్పున మొత్తం 25 సీట్లు ఉన్నాయి.

మూడేళ్ల మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్-సీట్లు

- బీబీఏ ప్రోగ్రామ్‌లో 6 సీట్లు ఉన్నాయి.
- **స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 12 నుంచి
- **వేదిక:** డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

ఫిల్మ్ డైరెక్షన్‌లో ఆన్‌లైన్ కోర్సు

పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్(సీఎఫ్ఓఎల్)- 'ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్షన్' కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. మొత్తం 33 సీట్లు ఉన్నాయి.

కోర్సు వివరాలు: కోర్సు వ్యవధి అయిదు రోజులు. ఆగస్టు 26 నుంచి కోర్సు ప్రారంభమౌతుంది. ప్రతి రోజూ ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు, మరల మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు సెషన్స్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. ఈ కోర్సులో సినిమా, లాంగ్వేజ్ ఆఫ్ సినిమా, స్పేస్ అండ్ టైమ్ ఆఫ్ సినిమా, ఫిల్మ్ ఫోరం, ఫిల్మ్ ఇమేజ్, ఫిల్మ్ సౌండ్, ఎలిమెంట్స్ ఆఫ్ స్టోరీ, స్క్రీన్‌ప్లే, వర్కింగ్ విత్ యాక్టర్స్, రోల్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్టర్ తదితర అంశాలు వివరిస్తారు.

అర్హత: పదోతరగతి/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. అభ్యర్థులు కనీసం 4 జీబీ ర్యామ్ గల డెస్క్‌టాప్/ల్యాప్‌టాప్, విండోస్ 7/8/10 ఆపరేటింగ్ సిస్టమ్, ఆడియో-వీడియో సాఫ్ట్‌వేర్, హెడ్‌ఫోన్/ఇయర్‌ఫోన్, హెచ్‌డీ వెబ్ క్యామ్, రోజుకి కనీసం 5 జీబీ ఇంటర్నెట్ ప్యాక్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్ ఏర్పాటు చేసుకోవాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** ftii.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/GABEQtfలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



మురారి చూస్తూ మూడుముళ్లు

అభిమాన హీరో సినిమా రిలీజ్ అవుతోందంటే క్షీరాభిషేకాలు, హారతులు, తీన్‌మార్ డప్పుల మోతలతో ఫ్యాన్స్ సందడి చేయడం తెలిసిందే. ఇప్పుడు మహేశ్‌బాబు అభిమానులు మరో అడుగు ముందుకేశారు. శుక్రవారం ఆయన నటించిన 'మురారి' చిత్రం రీ రిలీజ్ అయింది. ఈ సందర్భంగా కొందరు అభిమానులు థియేటర్లలో ప్రేక్షకులకు అక్షింతలు పంచగా, మరికొందరు థియేటర్లలోనే పెళ్లి చేసుకొన్నారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తెలుగు సినిమాల్లో పెళ్లి పాటల ప్రస్తావన తెస్తే అందులో 'మురారి' చిత్రంలోని 'అలనాటి రామచంద్రుడు' గీతం తప్పకుండా ఉంటుంది. అందుకేనేమో 'మురారి' సినిమా రీ రిలీజ్‌ను తమ పెళ్లికి వేదికగా చేసుకున్నారు మహేశ్‌బాబు అభిమానులు. 'అలనాటి రామచంద్రుడు' గీతం తెరపై ప్లే అవుతోన్న సమయంలో తన ప్రియురాలు మెడలో మూడు ముళ్లు వేశాడు ఓ యువకుడు. మరికొన్ని థియేటర్లలో అభిమానులు ప్రేక్షకులకు అక్షింతలు పంచారు. మహేశ్‌బాబు, సోనాలి బింద్రే పెళ్లి సీన్ రాగానే వాటిని తెరపైకి విసురుతూ వారంతా సందడి చేస్తున్న వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'మురారి' చిత్రం 2001లో విడుదలై ఘన విజయం అందుకొంది.

షూటింగ్ షురూ



అభిమానులంతా ఎప్పుడెప్పుడు షూటింగ్ మొదలవుతుందా అని ఎదురుచూస్తున్న క్రేజీ ప్రాజెక్ట్‌లో డైరెక్టర్ ప్రశాంత్ నీల్, జూనియర్ ఎన్టీఆర్ సినిమా ఒకటి. 'ఎన్టీఆర్ నీల్' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్, డైరెక్టర్ నీల్ కుటుంబ సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఈ సినిమాపై ఎన్ని అంచనాలు ఉన్నాయో తెలిసిందే. ఆ అంచనాలను మించి ఈ సినిమా ఉంటుంది. ఓ వైవిధ్యమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది" చెప్పారు. పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కనున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ సినిమా 2026 జనవరి 9న విడుదల కానుంది.



బచ్చన్ అలరిస్తాడు

'మిస్టర్ బచ్చన్' సినిమాతో కథానాయికగా తెలుగుతెరకు పరిచయమౌతున్నారు భాగ్యశ్రీ బోర్సే. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్‌లో తన అందం, అభినయంతో కుర్రకారు మనసును దోచేసిన ఆమె.. ఈ నెల 15న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. "ఇందులో నేను పోషించిన పాత్ర పేరు జిక్కీ. సినిమాలో నా పాత్ర చాలా కీలకమైనది. దర్శకుడు హరీశ్ శంకర్ ఈ కథ చెప్పగానే నచ్చేసింది. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను. అంచనాలను మించేలా దర్శకుడు ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఇది బాలీవుడ్ సినిమా రైడ్‌కు రీమేక్‌గా తెరకెక్కినా ఇందులో వినోదం, ప్రేమకథ అదనంగా ఉంటాయి. రవితేజ లాంటి అగ్ర నటుడితో కలసి నటించడం చాలా మధురానుభూతి. మిక్కీ.జే. మేయర్ సంగీతం ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. థియేటర్లో ప్రతి క్షణం ఎంజాయ్ చేసే సినిమా ఇది" అని చెప్పారు.



సూర్యకు స్వల్ప గాయం

తమిళ హీరో సూర్య స్వల్పంగా గాయపడ్డారు. ఆయన తాజాగా నటిస్తున్న చిత్రం షూటింగ్‌లో ఈ ప్రమాదం జరిగింది. అభిమానులు ఆందోళన చెందడంతో సూర్య స్నేహితుడు, సహ నిర్మాత రాజశేఖర్ పాండ్యన్ తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'ప్రియమైన అభిమానులారా.. ఇది కేవలం చిన్న గాయం మాత్రమే. దయచేసి ఎవరూ ఆందోళన చెందకండి. మీ అందరి ఆదరాభిమానాలు, ప్రేమ, ప్రార్థనలతో సూర్య బాగానే ఉన్నారు' అని పేర్కొన్నారు. కాగా, 'కంగువా' సినిమా తర్వాత కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో 'సూర్య44' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ కొత్త చిత్రం తెరకెక్కుతోంది. ఊటీలో రెండో షెడ్యూల్ షూటింగ్ జూలై 26 నుంచి శరవేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా 'నవానగర్ ప్యాలెస్'లో జూనియర్ ఫైటర్లతో కలిసి పోరాట సన్నివేశాన్ని చిత్రీకరిస్తుండగా, సూర్య తలకు స్వల్ప గాయమైంది. ఆ వెంటనే ఆయన్ని సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఈ ఘటన కారణంగా షూటింగ్ నిలిపివేశారు. చికిత్స అనంతరం సూర్య మళ్లీ లొకేషన్‌కు వచ్చి షూటింగ్‌లో పాల్గొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

కీలక షెడ్యూల్‌లో...



తమిళ స్టార్ హీరో అజిత్‌కుమార్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు-తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ బైలింగువల్ చిత్రానికి 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. సంక్రాంతి కానుకగా 2025లో చిత్రం విడుదలవుతోంది.

కొత్తగా..

నిరీక్షణకు తెర



'కేజీఎఫ్' తర్వాత యశ్ ఏ సినిమా చేస్తారా అని ఎదురు చూస్తున్న అభిమానుల నిరీక్షణకు తెర పడింది. ఆయన హీరోగా నటించే పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్.. ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' చిత్రం షూటింగ్ బెంగళూరులో పూజా కార్యక్రమాలతో మొదలైంది. యశ్ పుట్టిన రోజున ప్రారంభమైన ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. పవర్‌ఫుల్ కథతో, ఎమోషనల్ సీన్స్‌తో విజువల్‌గా ఉన్నతంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తామని నిర్మాత వెంకట్ కె నారాయణ చెప్పారు.

నిర్మాతగా మారిన దర్శకుడు



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మించే 'తల్లి మనసు' చిత్రం షూటింగ్ శుక్రవారం ఉదయం అన్నపూర్ణ స్టూడియోలో మొదలైంది. ముహూర్తపు షాట్‌కు ఏషియన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ నారంగ్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సీనియర్ నిర్మాత పోకూరి బాబూరావు తొలి క్లాప్ ఇచ్చారు. 'టైటిల్‌ను బట్టి చూస్తేనే ఇది ఎంత మంచి సబ్జెక్టో మీకు అర్థమవుతుంది' అన్నారు ముత్యాల సుబ్బయ్య. ఓ మధ్యతరగతి తల్లి చుట్టూ తిరిగే కుటుంబ కథా చిత్రమిదని దర్శకుడు శ్రీనివాస్ చెప్పారు.

కర్ణాటక నాటక అకాడమీ పురస్కారాన్ని తిరస్కరించిన ప్రకాశ్‌రాజ్



కర్ణాటక నాటక అకాడమీ వార్షిక పురస్కారాన్ని విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ తిరస్కరించారు. ఈ మేరకు 'ఎక్స్'లో శుక్రవారం పోస్ట్ చేశారు. అభిమానులు, అకాడమీని క్షమాపణలు కోరారు. పురస్కారాన్ని తీసుకునేందుకు తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, క్షమించాలని అన్నారు. ఇప్పుడిప్పుడే నాటకరంగంవైపు వెనుతిరిగానని, చేయాల్సిన పనులు ఎక్కువే ఉన్నాయని పేర్కొన్నారు. తనకంటే ఎంతో మంది అర్హులు రంగస్థలంలో ఉన్నారని, అందుకే తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, పురస్కారాన్ని తిరస్కరించానని తెలిపారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

నేనా.. సింగిలా..!



కీర్తి సురేశ్ నటించిన తమిళ చిత్రం 'రఘుతాత'. ఈ నెల 15న సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో ఉన్న ఆమె.. ఓ పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. "ప్రస్తుతం నా కెరీర్‌ను ఎంతో బాగా ఆస్వాదిస్తున్నాను. నా దృష్టిలో పెళ్లి అంటే ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు గౌరవం ఇచ్చుకుంటూ జీవితాంతం కొనసాగడమే" అని పేర్కొన్నారు. ఓ విలేఖరి మీరు సింగిలా అని ఆమెని అడగ్గా.. "నేను మీకెప్పుడు సింగిల్ అని చెప్పలేదు కదా" అని బదులిచ్చారు. దీంతో ఆమె రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు నిజమేనేమో అని అభిమానులు భావిస్తున్నారు.

దుబాయ్‌లో అమ్మేస్తాడేమో...

తాప్సీ పన్ను నటించిన 'ఖేల్ ఖేల్ మే' ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె మీడియాతో ముచ్చటించి ఓ ఆసక్తికర విషయాన్ని తెలియజేశారు. "నేను, నా భర్త మథియస్ బో 2013లో మొదటిసారి కలుసుకున్నాం. మొదటి సారి తనతో డేటింగ్‌కు వెళ్లాల్సినప్పుడు నన్ను దుబాయ్ రమ్మని మథియస్ ఆహ్వానించాడు. ఆ విషయం నా మిత్రురాలికి చెబితే.. జాగ్రత్త.. ఆయన నిన్ను దుబాయ్‌లో అమ్మేస్తాడేమో.. ఎందుకైనా మంచిది.. మా అక్క నంబర్ తీసుకో" అని ఓ స్నేహితురాలు చెప్పిన విషయాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు.



ఎన్టీఆర్ మునిమనవడితో



నందమూరి హరికృష్ణ, బాలకృష్ణలతో సినిమాలు రూపొందించిన దర్శకుడు, సీనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని అయిన వై.వి.ఎస్. చౌదరి తాజాగా ఓ చిత్రాన్ని రూపొందించనున్నారు. న్యూ టాలెంట్ రోర్స్ (ఎన్.టి.ఆర్.)పతాకంపై ఆయన సతీమణి గీత ఈ సినిమాను నిర్మించనున్నారు. సీనియర్ ఎన్టీఆర్ముని మనవడు, హరికృష్ణ మనవడు నందమూరి తారక రామారావు ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. అలాగే తెలుగు అమ్మాయి వీణా రావుని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నట్లు శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వై.వి.ఎస్. చౌదరి చెప్పారు.

సుప్రీం కోర్టులో లాపతా లేడీస్ ప్రదర్శన

బాలీవుడ్ చిత్రం 'లాపతా లేడీస్'కు అరుదైన గౌరవం దక్కింది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు చరిత్రలో తొలిసారి ప్రదర్శించిన సినిమాగా చరిత్ర సృష్టించింది. సుప్రీం కోర్టు వజ్రోత్సవాలను పురస్కరించుకొని 'లాపతా లేడీస్'ను శుక్రవారం సాయంత్రం కోర్టు ఆడిటోరియంలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో పాటు ఇతర న్యాయమూర్తులు, న్యాయస్థానం సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలసి ఈ చిత్రాన్ని వీక్షించారు. తన సొంత ప్రొడక్షన్‌లో ఆమిర్‌ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ఆయన మాజీ భార్య కిరణ్‌రావు దర్శకత్వం వహించారు. వారిద్దరూ ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లింగ సమానత్వం నేపథ్యంలో తెరకెక్కిన 'లాపతా లేడీస్' చిత్రం ఈ ఏడాది మార్చిలో విడుదలైంది. కమర్షియల్‌గా విజయం సాధించకపోయినా, విమర్శకుల ప్రశంసలతో పాటు పలు పురస్కారాలు అందుకుంది.

ప్రేమకథను ప్రశంసిస్తున్నారు



విజయ్‌శంకర్ హీరోగా నటించిన 'పాగల్ వర్సెస్ కాదల్' చిత్రం శుక్రవారం సినిమా విడుదలై మంచి టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ "డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు చాలా కొత్తగా అనిపించింది. కథకు అందరూ కనెక్ట్ అయ్యారు. ప్రేమకథ కొత్తగా ఉందని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఈ సినిమా విజయం సాధించడంతో ఎంతో ఆనందంగా ఉంది. యూత్, ఫ్యామిలీ.. ఇలా అన్ని వర్గాలకు చెందిన ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తున్నారు" అని చెప్పారు.

ప్రణయ గాథ



ఎస్.ఎస్. సైదులు, భ్రమరాంబిక, అర్పిత లోహి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం '1980ల రాధేకృష్ణ'. ఇస్మాయిల్ షేక్ దర్శకత్వంలో ఊడుగు సుధాకర్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఇస్మాయిల్ షేక్ మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన ప్రేమ కథ. ఈ సినిమా ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది" అని చెప్పారు.

'డీల్' కుదిరిందా?



హీరో హను కోట్ల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'డీల్'. పద్మారమా కాంతారావు, కొల్వి రామకృష్ణ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హను కోట్ల మాట్లాడుతూ "ఇదో డిఫరెంట్ కథతో వస్తున్న సినిమా. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని తెలిపారు.



వర్సిటీకి దక్కిన న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ పత్రాలను చూపుతున్న ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య కంచర్ల గంగాధరరావు

సమష్టి కృషి ఫలితంగానే నాక్ ఏ ప్లస్ గ్రేడ్

● వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు

పెదకాకాని, ఆగస్టు 9: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి సమష్టి కృషితోనే నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధ్యమైందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు అన్నారు. నాక్ కౌన్సిల్ నుంచి గురువారం వర్సిటీ కేటాయించిన నాక్ గ్రేడును నిర్ధారిస్తూ ప్రత్యేక సర్టిఫికెట్‌ను వర్సిటీకి పంపించారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ నాక్‌కు సంబంధించి వర్సిటీ సాధించిన ఘనతగా పేర్కొన్నారు. గ్రేడు సాధనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. నాక్ ఏ ప్లస్‌కు అనుసరించిన కార్యాచరణను నిరంతరం కొనసాగించాలన్నారు. ముఖ్యంగా ఆధ్యాపకులు వారు చేసే పరిశోధన పబ్లికేషన్‌లకు విశ్వవ్యాప్త గుర్తింపు ఉండేలా చూడాలన్నారు. అందుకుగాను స్కోపస్ వంటి ప్రముఖ జర్నల్స్‌ను ఎంపికచేసుకుని వాటికి అనుగుణంగా పరిశోధనపత్రాలు ప్రచురితమయ్యేలా చూడాలన్నారు. అలాగే అధ్యాపకులకు ఉన్న పేటెంట్ హక్కులను మరింత విస్తృతం చేసుకోవాలని సూచించారు. బోధన, పరిశోధనరంగాలలో విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి రెక్టార్ ప్రొఫెసర్ రత్నషీలామణి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, ప్రిన్సిపాల్స్ సిద్దయ్య, ఈ.శ్రీనివాస్ రెడ్డి, ప్రొఫెసర్ జాన్సన్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.రామచంద్రన్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వి. రవికుమార్, కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ ఎం.సుబ్బారావు, ఎన్వీ కృష్ణారావు, డాక్టర్ బ్రహ్మాజీరావు, డాక్టర్ దివ్యతేజమూర్తి, డాక్టర్ కృష్ణసత్య, ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, డాక్టర్ పి.రవి, ప్రొఫెసర్ సంధ్యకోల్, డాక్టర్ గోపికృష్ణ తదితరులు మాట్లాడారు.

జిల్లాకు 95 ఆర్టీసీ కొత్త బస్సులు

● కూటమి ప్రభుత్వం రాకతో కొత్తగా ప్రతిపాదనలు

● త్వరలోనే అందుబాటులోకి..

గుంటూరు, ఆగస్టు 9: విభజిత గుంటూరు జిల్లాకు 95 కొత్త ఆర్టీసీ బస్సులు సమకూరనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఆర్టీసీలో కొత్త బస్సుల ప్రతిపాదనలు మొదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 800 బస్సులు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఇటీవల రోడ్డు రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జిల్లాకు కూడా కొత్త బస్సులు అందుబాటులోకి రానున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎమ్ రవికాంత్ తెలిపారు. కాగా కొత్త బస్సుల్లో 47 అద్దె బస్సులు కాగా మరో 48 బస్సులు ఆర్టీసీ సంస్థకి సంబంధించిన సర్వీసులుగా పేర్కొన్నారు. 25 పల్లెవెలుగు సర్వీసులు, 14 సూపర్ లగ్జరీలు, 9 అల్ట్రాడీలక్స్, మరో 47 ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులోకి రానున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతోనే అద్దె బస్సుల ప్రతిపాదనలతో పాటు ఆర్టీసీ సంస్థ సొంతంగా కొత్త బస్సులు సమకూర్చునేలా ఏర్పాట్లుచేస్తోంది. ఇటీవలనే గుంటూరు నుంచి హైదరాబాద్‌కు రెండు బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. కాగా విభజిత గుంటూరు జిల్లాలో మొత్తం బస్సులు 500 లోపుగా ఉన్నట్లు చెబుతున్నారు. వీటిల్లో అత్యధిక శాతం డొక్కు బస్సులే. అధ్వానపు బస్సులతోనే నెట్టుకొస్తున్నారు.

మొరాయిస్తున్న బస్సులు....

అత్యధిక శాతం కాలంచెల్లిన బస్సులు ఉండటంతో మార్గమధ్యంలో మొరాయిస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో ఏ ఒక్క బస్సునూ సమకూర్చకపోవటంతోనే ఈ సమస్యలు ఎదురవుతున్నాయని ఆర్టీసీ గ్యారేజ్ కార్మికులే చెబుతున్నారు. అంతేగాక గ్యారేజ్‌ల్లోనూ బస్సుల నిర్వహణ కూడా కష్టతరంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు అధ్వానపు రహదారులు కూడా బస్సులను గుల్ల చేస్తున్నాయని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాకతో ఆర్టీసీ అభివృద్ధిపై దృష్టి పెట్టటంతో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

● పోటీల్లో పాల్గొననున్న 26 పురుషులు, మహిళా జట్లు

వినుకొండటౌన్, ఆగస్టు 9: పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోగల గుడ్ షఫర్డ్ పాఠశాలలో ఈనెల 10 నుంచి సోమవారం వరకు (10, 11, 12 తేదీలలో) రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ నరసింహారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి, 13 పురుషులు జట్లు, 13 మహిళా జట్లు పాల్గొంటాయన్నారు. పోటీల్లో భాగంగా క్రీడాకారులకు పాఠశాల డైరెక్టర్, డాక్టర్ ఇన్నారెడ్డి చేతుల మీదుగా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఆదేవిధంగా క్రీడాకారులకు మూడు రోజుల పాటు అవసరమైన వసతి, ఆహార సౌకర్యం ఏర్పాటుచేస్తున్న డాక్టర్ ఇన్నారెడ్డికి ఆర్గనైజింగ్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. పోటీలను వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

11న రాష్ట్రస్థాయి సిలంబం కర్రసాము పోటీలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 9: సిలంబం స్టిక్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ స్టేడియంలో ఈ నెల 11 తేదీన రాష్ట్రస్థాయి సిలంబం కర్రసాము పోటీలు, ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డీఎస్ క్రిష్టఫర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు సెప్టెంబరులో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు అదే రోజున స్టేడియంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

18న జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

మంగళగిరి సిటీ, ఆగస్టు 9: గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బెంచిప్రెస్ పోటీలు ఈ నెల 18వ తేదీన తెనాలిలో జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఘట్టమనేని సాయిరేవతి, క్విక్‌జిమ్ పర్యవేక్షణలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఉదయం 8 గంటలకు శరీర బరువు చూడడం జరుగుతుందని, పోటీల్లో పాల్గొనదలచిన వారు సంబంధిత వయసు ధ్రువీకరణ పత్రాలతో నిర్ణీత సమయానికి హాజరుకావాలని కోరారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలియజేశారు. వివరాలకు సెల్: 9346307979, 9700844497 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నాగార్జున సాగర్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



నిండుకుండలా మారిన పులిచింతల ప్రాజెక్టు



మాచర్ల రూరల్, ఆగస్టు 9: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్‌గేట్ల ద్వారా ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం నీటిని విడుదల చేశారు. 22 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 4గేట్లను 10అడుగుల మేర ఎత్తి 2,30,504 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 587.50 అడుగులు ఉంది. ఇది 305.80 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8680 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8367, 26 క్రస్ట్‌గేట్ల ద్వారా 2,30,504, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,029, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,78,380 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,11,491 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. కాగా 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీరు విడుదల చేస్తుండడంతో తిలకించేందుకు పర్యాటకులు శుక్రవారం విజయపురిసౌత్‌కు పోటెత్తారు. రహదారులు పర్యాటకులతో కిక్కిరిసిపోయాయి. పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ సందడిగా గడిపారు.

42 టీఎంసీలకు చేరిన నదీ జలాలు

● వరదతో పోటెత్తిన పులిచింతల

అచ్చంపేట, ఆగస్టు 9: పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పులిచింతల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాజెక్టు వద్ద వరదనీరు పోటెత్తటంతో 11 గేట్ల ద్వారా కృష్ణా జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ నుంచి 2,30,244 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ఇదిలా ఉండగా ప్రాజెక్టు నుంచి 2,42,355 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదలవుతోంది. 12వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా నదికి చేరుతోంది. ఆరు గేట్లను 2.50 మీటర్లు, మరో ఐదు గేట్లు మూడు మీటర్లు ఎత్తి కృష్ణాజలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో కృష్ణానదికి వరదనీరు పోటెత్తటంతో మత్స్యకారుల పడవలు ఒడ్డుకు చేరాయి. ప్రయాణికులను దాట వేసే పడవలు కూడా పూర్తిస్థాయిలో నిలిచి పోయాయి.

తగ్గుముఖం పట్టిన వరద

● ఊపిరి పీల్చుకున్న లంక గ్రామాల ప్రజలు

వరద నీటిలో నానుతున్న ఇటుక బట్టీలు





వరద నీటి బారినపడిన అరటి తోట

పోతార్లంక చప్టాపై ప్రవహిస్తున్న వరద నీరు



కొల్లూరు, ఆగస్టు 9: కృష్ణానదికి వరద తగ్గుముఖం పట్టింది. గత కొద్దిరోజులుగా వరద విపత్తుపై అధికారుల హడావుడితో భయాందోళనలకు గురైన లంక గ్రామాల ప్రజలు వరద ముంపు తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం వరద గంటగంటకు తగ్గుతోంది. అయితే గురువారం సాయంత్రం వరద ఉధృతి వల్ల చిన్నరేవులో నుంచి ప్రవహించిన నీరు పల్లపు ప్రాంతాల్లోని పంట పొలాలను ముంచెత్తుతూ దోనేపూడి వద్ద పోతార్లంక చప్టాపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో అక్కడ కొన్ని గంటలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అక్కడ కూడా చప్టాపై వరదనీరు తగ్గడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. అక్కడక్కడ పల్లపు ప్రాంతాల్లోని అరటి, అపరాలు, కూరగాయలు, పశుగ్రాసాల్లోకి వరద నీరు భారీగా చేరింది. దీని వల్ల ఆయా పంటలు స్వల్పంగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. చిన్నరేవు వెంబడి ఉన్న ఇటుక బట్టీలు వరదనీటి ముంపునకు గురయ్యాయి. పెసర్లంక అరవింద వారధి గండి వద్ద పోసిన కట్ట వరద ఉధృతికి తట్టుకుని నిలవడంతో ఆ ప్రాంతంలోని పంట పొలాలు, ఇటుక బట్టీల్లో నీరు చేరలేదు. కొంత సీపేజ్ వల్ల అక్కడ వరద నీరు స్వల్పంగా వచ్చినప్పటికీ ఆ గ్రామ సర్పంచ్ వెలివెల బసవరత్తయ్య ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ యంత్రాల సహాయంతో కట్టను పటిష్టపరుస్తూ చర్యలు తీసుకోవడంతో ఆ ప్రాంతంలో వరదనీరు చేరలేదు.

గణపవరంలో మహిళ హత్య



హత్యా స్థలంలో వివరాలు నమోదు చేసుకుంటున్న రూరల్ సీఐ సుబ్బ నాయుడు

నాదెండ్ల, ఆగస్టు 9: మండలంలోని గణపవరం గ్రామంలో షేక్ మస్తాన్‌బీ(45) అనే మహిళ హత్యకు గురైంది. ఈ ఘటన శుక్రవారం గ్రామంలో సంచలనం కలిగించింది. హత్య గావించబడ్డ మస్తాన్‌బీకి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. భర్త నాగూర్ సాహెబ్ మూడు నెలల క్రితం మృతి చెందాడు. సొంత ఇల్లు లేక పోవటంతో మస్తాన్‌బీ శివాలయం వీధిలోని వాటర్ ప్లాంట్ సమీపంలో గల పీర్ల చావిడికి చెందిన ఒక గదిలో నివాసం ఉంటున్నది. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మాలిక్‌రాజు అనే వ్యక్తి మూడు సంవత్సరాలుగా రాజీవ్‌గాంధీ కాలనీలో ఉంటున్నాడు. ఇటీవల అతని ఇంటి యజమానులు అతన్ని ఖాళీ చేయించారు. ఒక మేస్త్రి ద్వారా తాత్కాలికంగా పీర్ల చావిడికి చెందిన రెండవ గదిలో ఉంటున్నాడు. అతనికి గది ఇవ్వటాన్ని స్థానికులు కొందరు వ్యతిరేకించారు. రెండు గదులకు మధ్య చిన్న గోడ మాత్రమే ఉంది. గ్రామంలో నివాసం ఉంటున్న మస్తాన్‌బీ చిన్న కుమార్తె జాన్‌బీ ఉదయం తల్లికి టీ ఇచ్చేందుకు పీర్ల చావిడి గదికి వచ్చిచూడగా తల్లి విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించింది. కాళ్ళు చేతులు కట్టి వేసి దుస్తులు మెడకు బిగించి ఆమెను హత్య చేశారు. పక్క గదిలో ఉంటున్న మాలిక్‌రాజు పరారీలో ఉన్నాడు. మాలిక్‌రాజు ఆమెను అఘాయిత్యం చేసేందుకు ప్రయత్నించగా ప్రతిఘటించటంతో హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ బాల రామిరెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌ను గ్రామానికి రప్పించగా జాతీయరహదారి సమీపంలోని ఒక మిల్లు వరకు వచ్చి కుక్క నిలిచిపోయింది. సీఐ సుబ్బ నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జడ్పీ హైస్కూలు అభివృద్ధికి రూ.30 లక్షల వితరణ

● ఎన్ఆర్ఐ సోదరుల దాతృత్వం ● తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రార్థన మందిరం నిర్మాణం



గ్రామస్తులు, పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ సోదరులు

వట్టిచెరుకూరు, ఆగస్టు 9: తమ తండ్రి విధులు నిర్వహించి, తమకు విద్యాబుద్ధులు నేర్పి, శిఖరాలకు చేరువ చేసిన పాఠశాల అభివృద్ధికి తాము చేయూత నివ్వడం ఎంతో సంతోషాన్నిస్తుందని ఎన్ఆర్ఐ సోదరులు త్రిపురనేని ప్రభాకరరావు, రవికుమార్, భాస్కరరావులు తెలిపారు. శుక్రవారం వారు మండలం పరిధిలోని గారపాడు గ్రామం బొమ్మిడాల కోటిరత్నం జడ్పీ హైస్కూలును ప్రముఖ పారిశ్రామికవేత్త బోసురెడ్డితో కలిసి సందర్శించారు. తమ తండ్రి త్రిపురనేని సాంబశివరావు, తల్లి లక్ష్మీకాంతమ్మల జ్ఞాపకార్థం పాఠశాలలో ప్రార్థన మందిరం నిర్మాణానికి రూ.30లక్షల విరాళాన్ని అందజేస్తున్నట్లు ఎన్ఆర్ఐ సోదరులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ తండ్రి త్రిపురనేని సాంబశివరావు 1962 నుంచి 1968 వరకు ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించారన్నారు. ఈ పాఠశాలలో చదువుకున్న తాము, సోదరి బుజ్జి అనంతరం గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసి అమెరికా వెళ్ళి వైద్యవృత్తిలో స్థిరపడ్డామన్నారు. గతంలో జీజీహెచ్ అభివృద్ధికి రూ.కోటి విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద, పూర్వ విద్యార్థి తాటి వీరయ్య, సర్పంచ్ భవనం సుబ్బారెడ్డి, మన్నవ ప్రసాదరావు, అరుమళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	94, 102,113
చికెన్ విత్ స్కిన్	182.00
చికెన్ స్కిన్ లెస్	192.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



11వ వార్డులో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ నిర్మల్‌కుమార్

స్వచ్ఛ బాపట్ల నిర్మాణానికి కృషి : కమిషనర్

బాపట్ల, ఆగస్టు 9 : స్వచ్ఛ బాపట్ల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం 7వ సచివాలయం 11వ వార్డు విద్యానగర్, వైఎస్సార్‌నగర్ పరిసరప్రాంతాలలో కమిషనర్ పర్యటించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ సహకారంతో ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. డ్రైనేజీలు ఆధునీకరించటంతోపాటు ప్రతి ప్రాంతానికి తాగునీటి అందించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. తాగునీటి పైపులైన్‌లు కలుషితమైన ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేయించి స్వచ్ఛమైన నీటిని అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ఉమామహేశ్వరరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ నజీర్, మాజీ కౌన్సిలర్ వేమవరపు విజయ్‌కుమార్, వార్డు టీడీపీ నాయకులు పసుమర్తి యలమంద, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యానాదుల సమస్యలు పరిష్కరించాలి

● అఖిల భారత రైతు కూలీసంఘం నాయకుడు మేకల ప్రసాద్

బాపట్ల, ఆగస్టు 9 : నిరుపేద యానాదుల సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీసంఘం నాయకులు మేకల ప్రసాద్ కోరారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కొండుభొట్లపాలెం గ్రామంలో ఇంటిపని, వంటపని వారల సంఘం, ఐఎఫ్‌టీయుల అనుబంధం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి సంఘనాయకురాలు పాలెపు వెంకాయమ్మ, కాకినేటి సీత అధ్యక్షత వహించగా మేకల ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ యానాదుల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వాలు రూ.50 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కొండుభొట్లపాలెం నల్లమడ కట్టపై నివాసం ఉండేవారికి అంత్యోదయ బియ్యం కార్డులు పంపిణీ చేయాలన్నారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీతో గొర్రెలు, మేకలు అందించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు ప్రొఫెసర్ కె.విజయ్‌కుమార్, పీవోడబ్ల్యూ నాయకులు మువ్వల పల్లవి, నంబూరి సత్యం, గున్నం నాగమ్మ పాల్గొన్నారు.



కొండుభొట్లపాలెం గ్రామంలో యానాదులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలభారత రైతుకూలీసంఘం నాయకులు మేకల ప్రసాద్, పాలెపు వెంకాయమ్మ తదితరులు

● పిట్టలవానిపాలెం, ఆగస్టు 9 : పిట్టలవానిపాలెంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించారు. యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధికార ప్రతినిధి ఏకసిరి నరసింహారావు ఆధ్వర్యంలో నాయకులు, సభ్యులు కలిసి ప్రదర్శన చేశారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి గిరిజనుల సంక్షేమానికి నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నక్కా నాగేశ్వరరావు, పిట్టలవానిపాలెం అధ్యక్షుడు కోనేటి సుబ్బారావు, యూత్ అధ్యక్షుడు కోనేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై ప్రేమ కలిగి ఉండాలి

● జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు

బాపట్ల, ఆగస్టు 9 : ఎయిడ్స్ బాధితుల పట్ల ప్రేమ, అప్యాయత కలిగి ఉండాలని, వారి పట్ల వివక్షత చూపించకూడదని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. యూత్ ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలన సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో హెచ్‌ఐవి ఎయిడ్స్‌వ్యాధి నిర్మూలనకై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు 5కె రన్ నిర్వహించారు. సూర్యలంక రోడ్డులోని గాయత్రి అపార్ట్‌మెంట్ దగ్గర నుంచి ప్రారంభించిన 5కె రన్ మారథన్‌లో బాలుర విభాగంలో డీఎస్‌ఎం సుబ్బరాజు మొదటి బహుమతి, ఎ.కోటేశ్వరరావు ద్వితీయ బహుమతి గెలుపొందారు. బాలికల విభాగంలో ఎస్.రమ్యజాయ్ మొదటి బహుమతి, వి.చెన్నలీలా ద్వితీయ బహుమతి సాధించారు. డాక్టర్ వెంకటేశ్వర్లు వారికి బహుమతులు ప్రదానం చేసి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఎయిడ్స్ సోకిన వారిలో భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ ద్వితీయ స్థానంలో ఉందన్నారు. అందరం కలిసికట్టుగా దీని నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ జానీ, షేక్ నజీర్, స్వాములు, వీరాంజనేయులు, సాగర్, ఎ.శ్రీనివాసరెడ్డి, వెంకట్రావు పాల్గొన్నారు.



5కె రన్ నిర్వహిస్తున్న విద్యార్థులు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారులు

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించం

● ఎస్పీ తుషార్ డూడీ

● అనుమానితులను క్షుణ్ణంగా విచారించాలి



ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, ఆగస్టు 9 : విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని ఎస్పీ తుషార్ డూడీ పోలీసు అధికారులను హెచ్చరించారు. పోలీసు గస్తీ విధుల నిర్వహణ విషయమై శుక్రవారం ఆయన మాట్లాడుతూ నేరాలను నియంత్రించటానికి సమర్థవంతంగా గస్తీ నిర్వహించాలన్నారు. అనుమానితులను క్షుణ్ణంగా విచారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది ముమ్మరంగా గస్తీ విధులు నిర్వహిస్తున్నారని ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదన్నారు. రాత్రివేళల్లో బైక్‌లపై షికార్లు చేస్తున్న యువకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ అనుమానిత వ్యక్తులను విచారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, మద్యం, ఇతర అక్రమ రవాణాలను అరికట్టేందుకు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. పాత నేరస్తులు, చెడునడత కలిగిన వ్యక్తులను విచారిస్తున్నట్లు వివరించారు. సంబంధిత పోలీసుస్టేషన్ ఎస్సైలు, సీఐలు గస్తీ విధులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలన్నారు. అత్యవసర సమయాలలో మినహా వివిధ కారణాలతో అర్ధరాత్రులు బయటకొచ్చేవారు తప్పనిసరిగా వారి గుర్తింపుకార్డు తెచ్చుకోవాలన్నారు. గుర్తింపు కార్డు లేని వారిని అనుమానితులుగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. గస్తీవిధులు నిర్వహించే పోలీసు సిబ్బంది ప్రశ్నించినప్పుడు వారికి సహకరించాలన్నారు.

ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

● జిల్లా ఉద్యానవనశాఖాధికారి పి.జెన్నెమ్మ

బాపట్ల, ఆగస్టు 9 : జిల్లాలో ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు జిల్లా ఉద్యానవనశాఖాధికారి పి.జెన్నెమ్మ తెలిపారు. ఈవిషయమై శుక్రవారం ఆమె మాట్లాడుతూ వివిధ పథకాల కింద 2023-2024 సంవత్సరానికి సంబంధించి ఉద్యాన పంటల సమగ్రాభివృద్ధి పథకం కింద 110 లక్షలు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద 64 లక్షలు, జాతీయ పంటనూనెల మిషన్, ఆయిల్‌పామ్ కింద 1.06 లక్షల రూపాయలు ప్రభుత్వ రాయితీ విడుదలైందని ఆమె తెలిపారు. రాయితీ మొత్తాన్ని రైతుల ఖాతాలలో జమ చేశామన్నారు. ఉద్యానవన పథకాలలో రాయితీ పొందేందుకు రైతులు తమ గ్రామాలలోని రైతు సేవాకేంద్రాలలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించాలని జెన్నెమ్మ కోరారు.

షూటింగ్ బాల్ పోటీలకు వెదుళ్ళపల్లి విద్యార్థులు

బాపట్ల, ఆగస్టు 9 : చిత్తూరు జిల్లా కుప్పంలో ఈనెల 10, 11, 12 తేదీలలో జరిగే సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు బాపట్ల మండలం వెదుళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సి.జయ్‌కుమార్ తెలిపారు. బాలుర విభాగంలో ఓర్సు వరుణ్‌తేజ, బండారు చైతన్యశ్రీధర్, ఎన్.భానుసాయి, కె.సందీప్‌రాజ్, బాలికల విభాగంలో దేవరకొండ సుమశ్రీ, చెట్టుపల్లి శిరీష ఎంపికయ్యారు. పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బాపట్లకు విజయాన్ని తీసుకురావాలని ఆయన కోరారు. శిక్షణ ఇచ్చిన పీఈటీ ఎస్.రాంబాబు, విద్యార్థులను శుక్రవారం జరిగిన సభలో ఆయన అభినందించారు.

మత్తు వదలరా లఘుచిత్రం ప్రారంభం

బాపట్ల,ఆగస్టు 9 : వీఆర్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మత్తు వదలరా లఘు చిత్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. సినీనటులు డి.జయభారతరెడ్డి క్లాప్ కొట్టి ప్రారంభించగా చిత్రదర్శకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజంలో మాదకద్రవ్యాల వాడకం విపరీతంగా పెరిగిందని, యువతే లక్ష్యంగా మత్తుపదార్థాల సరఫరా పెద్ద మొత్తంలో జరుగుతుందన్నారు. తద్వారా ఎన్నో కుటుంబాలు నాశనమౌతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సందేశాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జి.గిరిజారాణి, వెంకు, ఫాతీమా, కెబిఎస్ రావు, షఫి, సాయికిరణ్, రాకేష్, పఠాన్ మహ్మద్‌ఖాన్, రబ్బానీ పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి చదరంగం పోటీలు

బాపట్ల, ఆగస్టు 9 : పట్టణంలోని విజయలక్ష్మీపురం లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌లో అండర్-13 బాలబాలికలకు చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి.నరేష్, ఉపాధ్యక్షుడు సూరా విజయబాబు తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేయటంతోపాటు ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన బాలబాలికలను శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించటం జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు పోటీలలో పాల్గొనాలని కోరారు. వివరాలకు మేనేజింగ్ డైరెక్టర్ గంటా అభినవ్‌ను 9493501506లో సంప్రదించాలన్నారు.

పట్టణ సీఐగా అహ్మాద్ జానీ



అహ్మాద్‌జానీ

బాపట్ల, ఆగస్టు 9 : బాపట్ల పట్టణ సీఐగా ఆర్.అహ్మాద్‌జానీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న సీఐ యు.శ్రీనివాసులు రేంజ్ వీఆర్‌కు బదిలీకావటంతో ఆయన స్థానంలో నెల్లూరు డీఎస్‌బీలో పని చేస్తున్న అహ్మాద్ జానీని ఇక్కడ నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఆయన నేరాల నియంత్రణకు కృషి చేస్తానని, ఫ్రెండ్లీ పోలీసు విధానాన్ని అమలు చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

మహర్షి ఆశ్రమ గోశాలలో విశిష్ట పూజలు

బాపట్ల, ఆగస్టు 9 : మండలంలోని మహర్షి ఆశ్రమ గోశాలలో శుక్రవారం శ్రావణమాసం నాగపంచమి తిథి పురస్కరించుకొని అమ్మవారికి విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పసుపుకుంకుమ, చీర, జాకెట్ సమర్పించి ప్రదోషకాల దీపోత్సవ కాలం నిర్వహించారు. అమ్మ ప్రసాదంగా చలిమిడిని భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ బి.బాబునాగేంద్ర, పసుపులేటి శ్రీనివాసరావు, మామిడి రాజశేఖర్, సురేష్‌రెడ్డి, మామిడి పద్మావతి, మల్లిశెట్టి భ్రమరాంబ, శ్యామలాదేవి, భాగ్యలక్ష్మి, యామిని, నాగమణి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేయటం దారుణం : ఎంపీపీ

బాపట్ల, ఆగస్టు 9 : విజయవాడ నడిబొడ్డున ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సామాజిక మహాశిల్పం శిలాఫలకాన్ని ధ్వంసం చేయటం దారుణమని ఎంపీపీ చినపోతుల హరిబాబు అన్నారు. దీనిని నిరసిస్తూ దళితనాయకులు, వైసీపీశ్రేణులతో కలిసి శుక్రవారం బాపట్ల రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ, మండలాధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి ఎస్సీ నాయకులు జోగి రాజా, అడే చందు, ఇనగలూరి మాల్యాద్రి, మైనార్టీ నాయకుడు షేక్ సయ్యద్‌పీర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే విజయవాడలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ, జిల్లా అధ్యక్షుడు పర్రె కోటయ్య, పి.ఏబేలు, కె.వినయ్‌రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల ప్రగతిపై అవగాహన

బాపట్ల, ఆగస్టు 9 : ప్రభుత్వ పథకాల ప్రగతిపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జిల్లా పరిషత్, హెల్త్ డిపార్ట్‌మెంట్, సోషల్ వెల్ఫేర్, ఐసీడీఎస్, డీఆర్‌డీఏలో ఉన్న అన్ని స్కీమ్‌లలో కాంపోనెంట్ గురించి డీపీఎంలకు వివరించారు. జిల్లా సమైక్య ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్షేమ పథకాలు గురించి తెలిపారు. కార్యక్రమంలో సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ ఎస్.సత్యభామ, ఎన్‌ఆర్‌ఎల్‌ఎం టీమ్ సభ్యులు ఎం.అన్సారీ, ఎండి కపీల్ ఖాన్, సమ్యక్‌లోహ ఖరేలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కొల్లూరు, ఆగస్టు 9 : పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్రారెడ్డి తెలిపారు. కొల్లూరులోని కరకట్ట వెంట పేకాట ఆడుతున్న నలుగురిని శుక్రవారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1310 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ రవీంద్రారెడ్డి చెప్పారు.

విద్యార్థులలో ప్రజా ఉద్యమ స్ఫూర్తి అవసరం

● అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

బాపట్ల, ఆగస్టు 9 : విద్యార్థులలో ప్రజా ఉద్యమ స్ఫూర్తి అవసరమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. పట్టణంలోని సరస్వతీమెమోరియల్ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థినులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి రమాదేవి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. స్వాతంత్రోద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, మత్తుపానీయాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు టి.సుబాషిణి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

రైతులకు జొన్న విత్తనాలు పంపిణీ

బాపట్లరూరల్, ఆగస్టు 9 : బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అర్హులైన రైతులకు పచ్చిగడ్డి పెంపకం కోసం 3 కేజిల జొన్న విత్తనాల కిట్‌లను రాష్ట్ర కల్లు గీత కార్మిక సంస్థ మాజీ చైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ ఉచితంగా పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే సేంద్రియ ఎరువుల తయారీ కోసం అవసరమైన డబ్బాలను ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో హైదర్‌పేటలోని దళిత రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎంపీడీవో విజయశేఖర్, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మంజూరుబాషా, పశు సంవర్ధకశాఖ సహాయకులు నరేంద్రవర్మ, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వరి పైరులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 9 : వరి పైరులో మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వినియోగించరాదని వ్యవసాయ శాఖ ఏడీ సయ్యద్ అక్తర్ హుస్సేన్ సూచించారు. ఏవో జి.మీరయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగిన క్షేత్ర సందర్శనలో భట్టిప్రోలులో వెదపద్ధతి వరి సాగును ఆయన పరిశీలించారు. రైతులతో సమావేశమై ఆయన మాట్లాడుతూ, వెద పెట్టిన, నాట్లు వేసిన వరి పొలాల్లో ఎరువుల యాజమాన్యం, వరిలో వచ్చే సూక్ష్మదాతు లోపాలైన జింక్, ఇనుపదాతు లోపాలను ఎలా నివారించాలో రైతులకు వివరించారు. ఏవో మాట్లాడుతూ, నీటి యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల నివారించడం, సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు తెలిపారు.కార్యక్రమంలో ఏఈవో స్వప్న, వీఏఏలు, మేట్‌లు రత్నరాజు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చెరువు ఆక్రమించే వారిపై చర్యలు చేపట్టాలి

కర్లపాలెం, ఆగస్టు 9 : పశువుల దాహాన్ని తీర్చటం కొరకు 1982వ సంవత్సరంలో అప్పటి కర్లపాలెం పంచాయతీ సర్పంచ్ మంతెన బాలకృష్ణంరాజు ఒక ఎకరం ప్రభుత్వ భూమిలో చెరువులను తవ్వించారని ఆ చెరువును నల్లమోతువారిపాలేనికి చెందిన పానసాల పోలేరు చెరువును పూడ్చి సాగు చేసుకుంటున్నాడని బాపట్ల నియోజకవర్గ బీజేపీ నాయకుడు షేక్ కరీముల్లా, నల్లమోతువారిపాలెం రైతులు శుక్రవారం తహసీల్దార్ వెంకటరత్నంకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీసాబత్తిన రాములు, గుర్రాల వెంకయ్య, వై.అచ్చయ్య, డొంకెన బ్రహ్మయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ వెంకటరత్నంను వివరణ కోరగా వీఆర్వో, సర్వేయర్లకు పరిశీలించమని రాశామని రిపోర్ట్ వచ్చిన తర్వాత అవసరమైన చర్యలు చేపడుతామని తహసీల్దార్ తెలిపారు.

ఆంధ్ర ప్రేక్షకుల మన్ననలను పొందిన జాలాది

బాపట్ల, ఆగస్టు 9 : సుప్రసిద్ధ గీత రచయిత, విలక్షణమైన గీతాలను రచించి ఆంధ్ర ప్రేక్షకుల మన్ననలను పొందిన జాలాది రాజారావు తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. శుక్రవారం జాలాది 92వ జయంతి కార్యక్రమంలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు సంయుక్తంగా మాట్లాడుతూ జాలాది సుమారు 70 సినిమాలకు 1500 గీతాలను రచించారని, ఎర్రమందారం చిత్రగీతాలకు నంది అవార్డు లభించిందని తెలిపారు. అనంతరం రచయితలు బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు, కె.కాళీదాసు, ఎం.జాకబ్ తదితరులు జాలాది చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళలు అర్పించారు.

రేపు శ్రీబగళాముఖి అమ్మవారి చీరల వేలం

పిట్టలవానిపాలెం, ఆగస్టు 9 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరల బహిరంగ వేలం పాట బాపట్ల దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ఆదివారం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఆసక్తికలిగిన భక్తులు ఈ వేలంలో పాల్గొనవచ్చునని తెలిపారు.

● శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసంలో తొలి శుక్రవారం సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. మండలంలోని జిఎస్‌పాలెం, ఖాజీపాలెం, అల్లూరు, పోతనకట్టవారిపాలెం, పిట్టలవానిపాలెం, కోమలి, భవనంవారిపాలెం, సంగుపాలెం, కోడూరు, మంతెనవారిపాలెం, కొత్తపాలెం, అలకాపురం, పిట్టువారిపాలెం గ్రామపంచాయతీలలోని ఆయా దేవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

హెచ్‌సీఎల్ టెక్‌బి ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

బాపట్ల,ఆగస్టు 9 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్‌బి ప్రోగ్రామ్ ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజిరావు తెలిపారు. ఇంటర్మీడియట్ సీఈసీ, బైపీసీలలో 75 శాతం కంటే ఎక్కువ మార్కులు ఉన్న విద్యార్థులు ఈ ప్రోగ్రామ్‌కు అర్హులు అన్నారు. సీఏటీ పరీక్షలలో ఎంపికైన అభ్యర్థులకు హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపికైన అభ్యర్థులు హెచ్‌సీఎల్ నుంచి టెక్‌బి ప్రోగ్రామ్‌లో చేరుటకు ఆఫర్ లెటర్ ఇవ్వటం జరుగుతుందన్నారు. సంవత్సరంపాటు ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఉంటుందని, 3 నెలలు క్లాస్‌రూమ్‌లో శిక్షణ సమయంలో అభ్యర్థికి రూ.10 వేల చొప్పున స్టైపెండ్ అందించటం జరుగుతుందన్నారు. ట్రైనింగ్ విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థి సంవత్సరానికి లక్షా 70 వేల రూపాయలు పొందవచ్చు అన్నారు. ఉన్నత విద్యకు హెచ్‌సీఎల్ వారు సహకారం అందిస్తారన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగే ఈ కార్యక్రమానికి విద్యార్థులు హాజరుకావాలని కోరారు.



మత్స్యసంపద కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మురళీధరరావు, రామకృష్ణ తదితరులు

మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పంతాని

రేపల్లె, ఆగస్టు 9 : మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి, మత్స్యకార సీనియర్ నాయకుడు పంతాని మురళీధరరావు అన్నారు. ఆయన నిజాంపట్నం హార్బర్‌లో మత్స్యసంపద కొనుగోలు కేంద్రాన్ని కోస్టల్ మెరైన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సహకారంతో తీరప్రాంతంలోని మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. మత్స్యకార భృతి అందించటంతో పాటు మత్స్యసంపదను ఇతర దేశాలకు ఎగుమతి చేసే విధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిలిచిపోయిన హార్బర్ అభివృద్ధి పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తామన్నారు. సన్న, చిన్న మత్స్యకారులు ఆర్థికంగా బలపడే విధంగా సబ్సిడీ రుణాలను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోస్టల్ మెరైన్ బోటు అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మిడి రామకృష్ణ, గౌరవాధ్యక్షుడు కన్నా మీరయ్య, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అత్యున్నతమైన విద్యను అందించాలి

● కరస్పాండెంట్, సెక్రటరీ వల్లభనేని బుచ్చయ్యచౌదరి

నగరం, ఆగస్టు 9 : మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతంలో మెరుగైన విద్య అందించటమే లక్ష్యంగా శ్రీవెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల పని చేస్తుందని కరస్పాండెంట్, సెక్రటరీ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అత్యున్నతమైన, నాణ్యమైన విద్యను పొందేందుకు కోటి రూపాయల రుసా నిధులతో కళాశాల ప్రాంగణంలో నూతనంగా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ రుసా నిధులతో కళాశాలలో విద్యార్థులకు నూతన భవన నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వీ కృష్ణప్రసాద్ (ఆర్‌టీఈఐ సొసైటీ వైస్ ప్రెసిడెంట్), డాక్టర్ వసంతం వీరరాఘవయ్య(ఆర్‌టీఈఐ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్), కె.రమణమూర్తి (ఆర్‌టీఈఐ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్), కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పూషడపు వెంకటనారాయణ, కళాశాల ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ అనగాని శ్రీనివాసరావు కళాశాల సూపరింటెండెంట్ పి.అమరేష్‌రెడ్డి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎన్‌వీకే ప్రసాద్

రాజ్యలక్ష్మి అమ్మవారికి వరలక్ష్మి వ్రతం

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 9 : భట్టిప్రోలులో ఉన్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కొలువైన రాజ్యలక్ష్మి అమ్మవారికి శ్రావణ మాసం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మి భజన మండలి ఆధ్వర్యంలో 40 మంది మహిళలచే సామూహికంగా వరలక్ష్మి వ్రతాలు జరిపారు. రాజ్యలక్ష్మి భజన మండలి ఆధ్వర్యంలో మానేపల్లి ఉమామహేశ్వరి, కొల్లూరు అనూష, మానేపల్లి శైలజ, కోట యశోదాదేవి నిర్వహించారు. చెన్నగిరి శారదాదేవి, దర్శి శశికళ, జల్లూరి వాణి, కారేపల్లి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులచే వరలక్ష్మి వ్రతం చేయించిన వారు బ్రహ్మశ్రీ మురికిపూడి దుర్గా ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం నరసింహ శ్రీనివాస్ పాల్గొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మచారి బూర్లె అరుణకుమారి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



రాజ్యలక్ష్మి అమ్మవారికి వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళా భక్తులు

శ్రీరామచంద్రుడు అందరికీ ఆదర్శప్రాయుడు

● టీటీడీ ధర్మప్రచారక్ హేమ శంకరరావు

వేమూరు, ఆగస్టు 9 : శ్రీమద్రామాయణంలో శ్రీరామచంద్రుని పాత్ర ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమైనదని తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మ ప్రచారకు జంజనం హేమ శంకరరావు అన్నారు. టీటీడీ పరిధిలోని సమరసత సేవా ఫౌండేషన్ పర్యవేక్షణలో మండలంలోని పెరవలిపాలెం గ్రామంలోని శ్రీ రామాలయంలో ధార్మిక కార్యక్రమ నిర్వహణ జరుగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం భక్తులు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి భజన సంకీర్తన అనంతరం శ్రీరామచంద్రునికి సీత అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం నిర్వహించిన ధార్మిక ఉపన్యాసంలో శంకరరావు మాట్లాడుతూ దైనందిన జీవితానికి ప్రతి ఒక్కరూ రామాయణాన్ని చదవాలని, అందులోనే పాత్రల విశిష్టతను గుర్తించి నడవాలని అన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ ద్వారా గ్రామ గ్రామాన దళితవాడలలోని ఎస్సీ కాలనీలలో రామాలయాల నిర్మాణం కోసంగా ప్రత్యేక నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఆలయ నిర్మాణం అనంతరం టీటీడీ ద్వారా శిక్షణ పొందిన అర్చకుని నియమిస్తారని కూడా వివరించారు. కార్యక్రమంలో రామాలయం అర్చకుడు గంజాం వెంకట రామప్రసాద్, ఉపన్యాసకురాలు బూర్ల అరుణ్‌కుమారి, చివ్వకుల శాంతకుమారి, గనాది నాగమణి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పెరవలిపాలెం రామాలయంలో ధార్మిక ఉపన్యాసం చేస్తున్న హేమ శంకరరావు

ఎస్టీయూ ఏపీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నర్రా

కర్లపాలెం, ఆగస్టు 9 : ఎస్టీయూ ఏపీ రాష్ట్ర ఉద్యమశిక్షణా తరగతుల కమిటీ సభ్యుడిగా ఎస్టీయూ నాయకుడు నర్రా సుబ్బారావు నియమితులయ్యారు. వీరి నియామకం పట్ల బాపట్ల మండల శాఖ, కర్లపాలెం, బాపట్ల, పిట్టలవానిపాలెం మండలాల ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బడుగు శ్రీనివాసరావు, జి.అమర్‌నాద్, పివి.నాగరాజు, బత్తుల నాగరాజు, పి.శివాంజనేయులు, ఎన్‌బి సుభానీ, నారాయణమూర్తి ఉన్నారు.



గురకాయపాలెం పాఠశాలలో మొక్కలు నాటుతున్న రోటరీ క్లబ్ సభ్యులు, ఎల్ఐసీ అధికారులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 9: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎల్ఐసీ అద్దంకి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ వి. మాధవ్‌కృష్ణ అన్నారు. శుక్రవారం అద్దంకి పట్టణంలోని గురకాయపాలెం ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, ఎల్ఐసీ అద్దంకి బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో రోటరీ మాజీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎల్ఐసీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని తెలిపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళ ఉపాధ్యాయులకు తులసి మొక్కలు అందజేయడంతో పాటు పాఠశాల ఆవరణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పలు రకాల పండ్లు, ఇతర మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, హెచ్‌యంలు రామిశెట్టి శ్రీనివాసరావు, ఎల్.సుజాత, ఎల్ఐసీ ఏబీఎం షేక్ ఖాదర్ మస్తాన్, సత్యనారాయణ, కే. వినోద్, రఫీ, మురళి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ



కేరళ బాధితులకు విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ఇంకొల్లు, ఆగస్టు 9 : కేరళ రాష్ట్రంలో అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న బాధితుల కోసం శుక్రవారం ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఇంకొల్లులో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రూ.25,000లు విరాళం సేకరించి రాష్ట్ర కమిటీకి అందజేయనున్నట్లు బాధ్యులు కందిమళ్ల రామకోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

గొప్ప గ్రంథం 'నేటి నిజం'



రామాంజనేయులు రాసిన నేటి నిజం కావ్యావిష్కరణలో సినీ నటుడు తిలక్ తదితరులు

అద్దంకిటౌన్, ఆగస్టు 9: ప్రజా సమస్యలకు పరిష్కారాన్ని చూపించే గొప్ప గ్రంథం నేటి నిజం అని ప్రముఖ సినీ నటుడు తిలక్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలోని రెస్టారెంట్‌లో అద్దంకికి చెందిన రచయిత చెన్నుపాటి రామాంజనేయులు రాసిన నేటి నిజం కావ్యావిష్కరణ శతాధిక గ్రంథకర్త కవి పి.సౌభాగ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాన్ని తిలక్ ఆవిష్కరించారు. ఆధునిక సమాజంలో నిత్యం జరిగే సంఘటలను తనదైన విమర్శనా పద్ధతిలో పద్య రచన సాగిందని పలువురు వక్తలు కొనియాడారు. ప్రముఖ కవి బీరం సుందరరావు నేటి నిజం గ్రంథంపై సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ తెలంగాణ పూర్వ అధ్యక్షుడు కె. వేణుగోపాల్, అనువాద రచయిత అనిశెట్టి శంకర్, కథ, రచయిత్రి తుర్లపాటి లక్ష్మి, ఎస్‌వీ రాఘవయ్య, చెన్నుపల్లి నాగేశ్వరరావుతో పాటు రామాంజనేయులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శ్రావణ శుక్రవారం పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అద్దంకి, ఆగస్టు9: శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా అద్దంకి పట్టణంలోని చక్ర సహిత వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని పసుపుతో అలంకరించారు. గణపతి, అమ్మవార్లకు అభిషేకం, అర్చన, నవగ్రహ, వాసవి, శ్రీసూక్త, దుర్గాసూక్త హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

వ్యవసాయరంగం నుంచి కార్పొరేట్లను తరిమికొట్టాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: దేశంలోని వ్యవసాయరంగం నుంచి కార్పొరేట్లను తరిమికొట్టాలని పలు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో క్విట్ కార్పొరేట్ ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పెంట్యాల హనుమంతరావు, పీవీఆర్.చౌదరి, జీవీ.కొండారెడ్డి, ఎస్.లలితకుమారి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. రైతులు, వ్యవసాయ కూలీల శ్రమను దోపిడీ చేస్తూ కార్పొరేట్‌శక్తులకు కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని మండిపడ్డారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా ప్రత్యక్ష పనులను దేశంలో 30శాతం నుంచి 20శాతానికి తగ్గించడం దుర్మార్గంగా ఉందన్నారు. దీంతో ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, పద్మ, ఎంఎస్.సాయి, కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ శ్రీనివాసరావు, ఆర్.వెంకట్రావు, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ పరిరక్షణకు ఉద్యమించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: ఎల్ఐసీని దెబ్బతీసేందుకు కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ఉద్యమించాలని ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా డే సందర్భంగా శుక్రవారం ఒంగోలులోని ఎల్ఐసీ కార్యాలయలో ఎల్ఐసీఏఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.బాలచంద్రం, నెల్లూరు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడిన ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎల్ఐసీ అత్యంత ముఖ్యమైన బ్రాండ్‌లలో మూడవ స్థానంలో ఉందన్నారు. ప్రజలకు ఆర్థిక భరోసాను, సామాజికభద్రతను అందించడమే కాకుండా దేశానికి ఉపయోగపడే అనేక ప్రాజక్టులకు ఆర్థిక సహకారాన్ని ఎల్ఐసీ అందిస్తుందని చెప్పారు. అటువంటి సంస్థను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని, దీనిని అడ్డుకునేందుకు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, ఆర్.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, బీవీ.రమణయ్య, కె.రమణారెడ్డి, డి.మధుబాబు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంలో రివ్యూ పిటిషన్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేసినట్లు మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు తెలిపారు. ఒంగోలులోని అంబేడ్కర్ గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2011లో సివిల్ అప్పీల్‌లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు ఏడుగురు జస్టీస్‌ల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన వర్గీకరణ తీర్పును ఆర్టికల్ 137 ప్రకారం రివ్యూ కోరటం జరిగిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీకులాల రిజర్వేషన్లు వర్గీకరణ చేస్తూ 1997లో అప్పటి ప్రభుత్వం చట్టం తెచ్చిందన్నారు. దీనిని సవాల్ చేస్తూ మాలమహాసభతో పాటు మరికొన్ని సంఘాలు ఉమ్మడి హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పిటీషన్‌ను జస్టిస్ లిబర్‌హాన్ ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారించి ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల వర్గీకరణ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని జడ్జిమెంట్ ఇచ్చిందన్నారు. ఈ తీర్పును సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్ వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇచ్చిన తీర్పుపై కూడా సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహాసభ ముందుండి పోరాడుతుందని చెప్పారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు చప్పిడి వెంగళరావు, దండేల కృష్ణ, కొండమూరి ప్రకాష్, కురుగుంట్ల వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, గంటా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మేయర్ పదవిపై దోబూచులాట

- కార్పొరేటర్లు క్యూ కట్టడంతో టీడీపీకి మెజారిటీ
- పదవిపై హామీ కోసం మేయర్ ప్రయత్నాలు
- చంద్రబాబుదే తుది నిర్ణయమన్న ఎమ్మెల్యే దామచర్ల
- 12న మరోసారి భేటీ కావాలని నిర్ణయం
- ఇదీ ఒంగోలు కార్పొరేషన్ రాజకీయ వ్యవహారం



ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ పదవి విషయమై దోబూచులాట జరుగుతోంది. కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు క్యూ కట్టడంతో కార్పొరేషన్‌లో వైసీపీ అధిపత్యానికి గండిపడటం ఖాయమని తేలిపోయింది. రానురాను టీడీపీలో చేరే కార్పొరేటర్ల సంఖ్య పెరిగిపోతోంది. అదేసమయంలో మేయర్ గంగాడ సుజాత వ్యవహారశైలి చర్చనీయాంశమైంది. పూర్తి కాలం తనను మేయర్‌గా కొనసాగించేలా హామీ తీసుకొని టీడీపీలోకి అడుగు పెట్టాలని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. ఆ విషయం చంద్ర బాబు తేల్చాలని ఎమ్మెల్యే జనార్దన్ ఆమెకు చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో పార్టీ మారే విషయంలో మేయర్ సుజాత నిర్ణయం వెల్లడి కాకపోగా వైసీపీ కార్పొరేటర్లు మాత్రం రోజుకు ఇద్దరు ముగ్గురు టీడీపీలో చేరుతున్నారు. శుక్రవారం జరిగిన కొన్ని పరిణామాల అనంతరం ఈవిషయంలో తదుపరి నిర్ణయాలను ఎమ్మెల్యే జనార్దన్ సోమవారానికి వాయిదా వేసినట్లు తెలిసింది.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ వైపు దృష్టి సారించారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పక్షాన ఆరుగురు, జనసేన తరఫున ఒకరు గెలుపొందారు. వైసీపీ నుంచి 42 మంది, స్వతంత్ర అభ్యర్థి ఒకరు విజయం సాధించారు. ఆతర్వాత స్వతంత్ర అభ్యర్థి కూడా వైసీపీలో చేరడంతో ఆ పార్టీ కార్పొరేటర్ల బలం 43కు చేరింది. గత అసెంబ్లీ ఎన్నికల సమరం ప్రారంభంకాగానే ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ఆ తర్వాత పేర్నమిట్ట ప్రాంత కార్పొరేటర్ సైకిలెక్కారు. గురువారం మరో నలుగురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం 50వ వార్డు కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, 17 వార్డు కార్పొరేటర్ శేషగిరిరావు చేరారు. దీంతో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కార్పొరేటర్ల సంఖ్య 11కు చేరింది. టీడీపీ కూటమి బలం 18 అయింది. కాగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి పార్టీలో చేరేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన వారిలో డిప్యూటీ మేయర్ బుజ్జి, శ్యాండిల్య, పద్మావతి, అలాగే మూడో డివిజన్ కార్పొరేటర్ భర్త, రెండో డివిజన్ కార్పొరేటర్ గాంధీ, స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది వైసీపీలో చేరిన గోపి ఉన్నారు. ఈ ఆరురుగు కూడా చేరితే కార్పొరేషనల్‌లో కూటమి బలం 24 అవుతుంది. వీరు కాక కోప్షన్ సభ్యులుగా ఒంగోలు ఎంపీ మాగుంట, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు జనార్దన్, విజయ్‌కుమార్‌లు ఉంటారు. వారి ఓట్లతో కలిసి కార్పొరేషన్‌లో టీడీపీకి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తోంది

ఇక తేలాల్సింది మేయర్ వ్యవహారమే

నగర మేయర్ గంగాడ సుజాత గురువారం సాయంత్రం ఎమ్మెల్యే జనార్దన్‌ను కలిశారు. ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడారు. మొదటి నుంచి మేయర్ సుజాత కచ్చితమైన నిర్ణయంతో ముందుకు సాగడం లేదు. ఒకసారి జనార్దన్‌ను కలిశారు. ఆతర్వాత రెండు రోజులకే హైదరాబాద్ వెళ్లి మాజీ మంత్రి, వైసీపీ నేత బాలినేనితో భేటీ అయ్యారు. ఇటీవల ఢిల్లీలో వైసీపీ అధినేత జగన్ చేపట్టిన ధర్నాకు హాజరయ్యారు. దీంతో పార్టీ మారే ఆలోచనను మేయర్ మార్చుకున్నారన్న భావనకు టీడీపీ నాయకులు వచ్చారు. అయితే ఆమె టీడీపీలో చేరాలనుకుంటున్న కొందరు కార్పొరేటర్లతో పాటు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే దామచర్లను మళ్లీ కలిశారు. విశ్వసనీయ సమాచారం మేరకు జనార్దన్, సుజాత మధ్య మేయర్ పదవిపైనే చర్చ జరినట్లుగా తెలిసింది. పూర్తికాలం మేయర్‌గా కొనసాగాలన్న తన ఆలోచనను సుజాత వ్యక్తంచేసినట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే జనార్దన్ మేయర్ పదవి విషయంలో సీఎం చంద్రబాబు తీసుకునే నిర్ణయమే మాకు శిరోధార్యమని, మేము ప్రత్యేకంగా నిర్ణయం తీసుకోబోమని చెప్పినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి వద్దే చేరికల కార్యక్రమం పెడితే తాము ముందుగానే తమ ఆలోచనను ఆయన దృష్టికి తీసుకెళ్తామన్న అభిప్రాయాన్ని మేయర్‌తోపాటు ఆమెకు మద్దతుగా ఉన్న కొందరు కార్పొరేటర్లు చెప్పినట్లు సమాచారం. దీనిపై ఎమ్మెల్యే జనార్దన్ స్పందిస్తూ.. పార్టీలో చేరాల్సిన, చేరిన కార్పొరేటర్లను సీఎం వద్దకు తీసుకెళ్లేందుకు తనకు అభ్యంతరం లేదని చెప్పారు. తాను హైదరాబాద్‌లో శుభ కార్యానికి హాజరు కావాల్సి ఉందని, సోమవారం మళ్లీ కలుద్దామని చెప్పినట్లు తెలిసింది.

టీడీపీలో చేరిన ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 9: వైసీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు శుక్రవారం టీడీపీలో చేరారు. ఒంగోలులోని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నివాసంలో ఆయన సమక్షంలో 50 డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాద్, 17వ డివిజన్ కార్పొరేటర్ నాగం వెంకటశేషయ్య కలిసి సైకిలెక్కారు. వారికి దామచర్ల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండవ మురళీకృష్ణ పాల్గొన్నారు.

గిరిజనుల సమగ్రాభివృద్ధికి కృషి

- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి



మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 9: గిరిజనుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక గిరిజన భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పొన్నలూరు, కనిగిరిలో గతంలో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన గురుకులాల పెండింగ్ పనులను పూర్తిచేసి త్వరలో అందుబాటులో తేస్తామన్నారు. గిరిజనులలో అక్షరాస్యత పెంచేలా చర్యలు చేపడతామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు మరింత ప్రయోజనం కల్పించేలా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. హాస్టళ్లను గురుకులాలుగా మార్చిన చోట తలెత్తుతున్న పరిపాలనాపరమైన సమస్యల పరిష్కారానికి గిరిజన శాఖ మంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఐటీడీఏ రీజనల్ ఆఫీసు జిల్లాలో ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. శ్రీశైలం వెళ్లే మార్గాన్ని నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించడంతోపాటు అర్హులైన గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు మంజూరు చేస్తామని మంత్రి స్వామి తెలిపారు. డీఎస్సీ రాసే ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా వసతి, శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలోని గిరిజనులందరికీ ఆధార్ కార్డులు ఉండేలా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గిరిజన యువతకు అవసరమైన శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

383 మంది చెంచులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు

ఈ సందర్భంగా ఆధార్ నమోదు కేంద్రాన్ని, ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఔషధ శిబిరాన్ని మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా ప్రారంభించారు. అనంతరం ఎర్రగొండపాలెం దోర్నాల, పుల్లలచెరువు మండలాల్లోని 383 మంది చెంచులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను పంపిణీ చేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన గిరిజన విద్యార్థులకు డిక్షనరీలను అందజేశారు. గిరిజన భవనానికి నాలుగు కూలింగ్ వాటర్ బబుల్స్‌ను గిరిజన నాయకులు ప్రసాద్ బహూకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, సంక్షేమశాఖల అధికారులు లక్ష్మానాయక్, అర్జున్ నాయక్, డాక్టర్ బాలాజీ నాయక్, విజిలెన్స్ కమిటీ సభ్యుడు లక్ష్మయ్య, గిరిజన సంఘాల నాయకులు పేరం సత్యం, మాల్యాద్రి, సైదా నాయక్, మోగన్న, స్థానిక కార్పొరేటర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టరేట్ నుంచి గిరిజన భవన్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు.

రీకౌంటింగ్ కాదు..చెకింగ్!

ఒంగోలు నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 9 : ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని 12 పోలింగ్ కేంద్రాల్లో డమ్మీ బ్యాలెట్‌లతో చెకింగ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఇది రీ కౌంటింగ్ కాదని ఆమె స్పష్టం చేశారు. డమ్మీ బ్యాలెట్‌ను ఈవీఎంలలో చూపించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఒంగోలులో శుక్రవారం తనను కలిసిన విలేకరులతో ఆమె మాట్లాడారు. మొత్తం 12 పోలింగ్ కేంద్రాలపై అనుమానాలు ఉన్నట్లు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఈనెల 19నుంచి 24వతేదీ వరకు రోజుకు రెండు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల చెకింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంబంధించి బెల్ కంపెనీ, ఎన్నికల కమిషన్ నుంచే ప్రతినిధులు వచ్చి డమ్మీ బ్యాలెట్ పేపర్లను ఈవీఎంలను పెట్టి చెక్ చేసి చూపిస్తారని తెలిపారు.

దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: బాలసదన్, శిశుగృహంలోని ఆరేళ్లలోపు పిల్లలను త్వరగా దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న లీగల్ దత్తత రికార్డులు వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. బాలసదనంలోని పిల్లలు స్కూలుకు వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని, ఎవరూ కూడా హోమ్‌లో ఖాళీగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో బాలల సంక్షేమ కమిటీ సభ్యులు నిలీమ, వంశీలత, శివశంకర్, సుమన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్, డీపీవో బాలప్రభాకర్, లీగల్ ఆఫీసర్ రత్నప్రసాద్ పాల్గొన్నారు.

పశుపోషకులకు గడ్డి విత్తనాల పంపిణీ

మార్టూరు, ఆగస్టు 9: స్థానిక పశువైద్యశాలలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులమేత కోసం పశుపోషకులకు గడ్డి విత్తనాలను అర్హులైన రైతులకు పంపిణీ చేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ పీవీ నరసింహారావు అధ్వర్యంలో రైతులకు జొన్నరకం గడ్డి విత్తనాలు 3 కిలోల కిట్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. పశుసంపద గలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీ కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కామినేని జనార్దన్, కమ్మ శివనాగేశ్వరరావు, గొట్టిపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పీడీసీసీబీ నికర లాభం రూ.1.47కోట్లు

ఒంగోలు(విద్య), ఆగస్టు 9: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (పీడీసీసీబీ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.47 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఒంగోలులోని బ్యాంకు కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన మహాజన సభలో గత ఆర్థిక సంవత్సరంపు ఆడిట్ నివేదికను ఆమోదించారు. బ్యాంకు అధికారి పీఏసీ జాయింట్‌కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధ్యక్షతన మహాసభ జరిగింది. ఆడిట్ నివేదిక ప్రకారం బ్యాంకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.11 కోట్ల లాభాలు ఆర్జించింది. అయితే ఈ మొత్తం నుంచి బ్యాంకు రిజర్వు నిధి, ఇన్వెస్టిమెంట్ ఫ్లక్చ్యుమిషన్, ట్యాక్స్ లయబిలిటి తదితరాలు పోను బ్యాంకుకు నికరంగా రూ.1.47 కోట్లు రాబడి వచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకారాధికారి బి.శ్రీనివాసరెడ్డి, సీఈవో కొండారెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9: జిల్లాలో 2047 నాటికి అన్ని రంగాల్లో జిల్లా సమగ్రాభివృద్ధి సాధించేలా కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ అభివృద్ధిలో మహిళలను కూడా భాగస్వాములు కావడం అత్యంత కీలకమన్నారు. ఈ దిశగా బ్యాంకు రుణాలు ఇచ్చి స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చేందుకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖలు, బ్యాంకుల అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 9500 ఎస్‌హెచ్‌జీ మహిళలతో ఈ ఆర్థికసంవత్సరం రూ.133కోట్ల పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించేలా చేయాలన్నదే లక్ష్యమన్నారు. ప్రతి మహిళ లక్ష రూపాయాలకు పైగా పెట్టుబడి పెట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ దిశగా వారికి రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను ఆదేశించారు. పేదరికం లేని ప్రకాశం జిల్లా ఆవిష్కృతం కావడానికి బ్యాంకర్లు కూడా తమవంతు పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఆర్థికపరమైన సమస్యలు ఉంటే డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు, ఎల్‌డీఎంలతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు.

సమావేశంలో పలు శాఖల అధికారులు వసుంధర, రవికుమార్, రమణ, శ్రీనివాసరావు, గోపీచంద్, చంద్రశేఖర్‌రెడ్డి, బేబీరాణి, జి.శ్రీనివాస్, ఎల్‌డీఎం రమేష్, నాబార్డు డీడీఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వాంతంత్ర్య దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

- 15న జెండా ఆవిష్కరించనున్న మంత్రి స్వామి
- ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంగోలు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే సంబంధిత అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా సమీక్షలు చేసి శాఖల వారీ బాధ్యతలను అప్పగించారు. ఒంగోలులో నిర్వహించే జిల్లాస్థాయి వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. సాధారణంగా స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఇన్‌చార్జి మంత్రులు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి రెండునెలలే కాగా ఇంకా ఇన్‌చార్జి మంత్రుల నియామకం జరగలేదు. ఈనేపథ్యంలో ఆగస్టు 15న ఎవరు జెండా ఆవిష్కరించాలన్న దానిపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అందుకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ప్రకారం ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నమైంది.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఏటా ఘనంగానే నిర్వహిస్తుంటారు. అయితే ఈసారి రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడటం, మంత్రి, కలెక్టర్, ఎస్పీలు కొత్తవారు కావడంతో మరింత భారీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

రెవెన్యూ ప్రజాదర్బార్‌కు ఏలూరి శ్రీకారం

- 21న భూ సమస్యలపై వినతుల స్వీకరణ



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, ఆగస్టు 9: రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రెవెన్యూ ప్రజా దర్బార్‌కు శ్రీకారం చుట్టారు. ఈనెల 21వ తేదీన పర్చూరు మార్కెట్ యార్డు వేదికగా కార్యక్రమం చేపట్టనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయా మండలాల తహసీల్దార్‌లతో సమీక్ష నిర్వహించారు.

సమస్యలకు పరిష్కారం చూపేలా..

రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించేలా డివిజనల్, మండల రెవెన్యూ అధికారులతో రెవెన్యూ దర్బార్ కొనసాగనుంది. భూమి హద్దులు, అసైన్డ్ సమస్యలు, తప్పుడు తడకగా ఉన్న భూములు వివరాల సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. దీనిపై అన్నదాతలు ఎమ్మెల్యే ఏలూరికి విన్నవించుకున్న నేపథ్యంలో స్పందించిన ఏలూరి రెవెన్యూ దర్బార్‌కు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి, చినగంజాం, మార్టూరు మండలాలకు చెందిన తహసీల్దార్లను భాగస్వాములను చేస్తూ ప్రణాళిక రచించారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను మండలాల వారీగా ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేసి వినతులు స్వీకరించి పరిష్కారానికి చొరవ చూపేలా ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. మండల స్థాయిలో పరిష్కారం కానీ సమస్యలను రెవెన్యూ డివిజన్ అధికారి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నారు.

సమస్యలకు మోక్షం..

అనేక ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలకు పరిష్కారమే ధ్యేయంగా వినూత్న రీతిలో ఎమ్మెల్యే ఏలూరి రెవెన్యూ దర్బార్‌లు నిర్వహించే విధంగా ఆదేశాలు జారీచేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతాంగం అనేక రెవెన్యూ సమస్యలతో సతమతమయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగా ప్రజల ఆస్తులను కొల్లగొట్టేందుకు వైసీపీ ప్రభుత్వ శ్రీకారం చుట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కూటమి ప్రభుత్వం రద్దుచేసింది. పర్చూరు నియోజకవర్గంలో ఎనిమిది దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని 5వేల ఎకరాల ఇనాం, ఎస్టేట్ భూముల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవ చూపారు. దీంతో ఈభూములకు పట్టాలు ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.


కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఆలయ అభివృద్ధికి సహకారం అభినందనీయం

● ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, ఆగస్టు 9: కోట్ల రూపాయల వ్యయంతో రూపుదిద్దుకున్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు వైజంక్షన్‌లో ఏర్పాటు చేసిన 92 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ప్రవాసాంధ్రుడు, జనసేన నాయకులు మన్నెం శ్రీకాంత్, సాయిరమ్య దంపతుల ఆర్థిక సహకారంతో రూ.40లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న వంటశాల, పూజారి గదుల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, జనసేన నాయకులు ఆలా అనిల్ కుమార్, పెదపూడి విజయ కుమార్, అరుణ, ప్రముఖ వ్యాపారవేత్త నర్రా వెంకట్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏలూరికి ఆలయ కమిటీ ప్రతినిధులు మేళ తాళాలు, పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా కొబ్బరి కాయకొట్టి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత స్వామివారి దర్శించుకొని పూజాకార్యక్రమాలు చేసి భక్తిని చాటుకున్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు ఉప్పుటూరి మురళీకృష్ణ, డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు కోటా హరిప్రసాద్, రంగిశెట్టి ఆంజనేయులు, కఠారి సురేంద్రబాబు, కోడూరి శేషబ్రహ్మాచారి, గడ్డిపాటి శ్రీనివాసరావు, మంగళగిరి కోటేశ్వరరావు, తులసి అప్పారావు, క్రిష్ణంశెట్టి శ్రీనివాసరావు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి దుర్గా ప్రసాదరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కవి చందలూరి నారాయణరావు తదితరులు

కవి నారాయణరావుకు హైకోర్టు జడ్జి అభినందనలు

అద్దంకిటౌన్, ఆగస్టు 9: కవి చందలూరి నారాయణరావు రాసిన కవితలలో ఉన్న సరళతను, అందమైన భావ వ్యక్తీకరణను హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి యు. దుర్గా ప్రసాదరావు కొనియాడి అభినందించారు. అ మరావతిలోని హైకోర్టు ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల ఆధ్వర్యంలో ప్రముఖ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి యు. దుర్గాప్రసాదరావు ఉద్యోగ విరమణ సభకు సెంట్రల్ గవర్నమెంట్ కౌన్సిలర్, న్యాయవాది బాచిన హనుమంతరావుతో పాటు కవి చందలూరి నారాయణరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి దుర్గాప్రసాదరావుకు కవిని న్యాయవాది హనుమంతరావు పరిచయం చేశారు. గతంలో తాను రాసిన కొన్ని కవితల గురించి వివరించారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జరిగే పలు కార్యక్రమాలను న్యాయమూర్తికి వివరించారు. అలాగే నారాయణరావు రాసిన 'మనం కాసేపు మాట్లాడుకుందాం' అనే పుస్తకాన్ని చదివిన న్యాయమూర్తి నారాయణరావును అభినందించారు.

డివైడర్‌ను ఢీ కొన్న కారు - ఒకరికి గాయాలు

మేదరమెట్ల, ఆగస్టు 9: జాతీయ రహదారిలో అత్యవసర రన్‌వేపై కారు డివైడర్‌ను ఢీ కొన్న సంఘటనలో ఒకరికి గాయాలు అయ్యాయి. నెల్లూరు నుంచి విజయవాడకు కారులో వెళ్తున్న ధీరజ్ వెంకటాపురం వద్ద డివైడర్ దిమ్మెలను ఢీ కొనడంతో స్వల్ప గాయాలు అయ్యాయి. 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి పంపించి వేశారు.

టిప్పర్, మోటార్ సైకిల్ ఢీ - ఒకరికి గాయాలు

బల్లికురవ, ఆగస్టు9: మండలంలోని మల్లాయపాలెం సమీపంలో శు క్రవారం టిప్పర్, మోటార్‌సైకిల్ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్ పై వెళ్తున్న ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు.

కృష్ణ అభిమాని అన్నదానం

మార్టూరు, ఆగస్టు9:స్థానిక అమ్మ ఆశ్రమంలో శుక్రవారం స్వర్గీయ సినీనటుడు కృష్ణ జన్మదినం సందర్భంగా మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రత్నకుమార్ పేదలకు, వృద్ధులకు అన్నదానం చేశారు.

సంధికాలపు భత్యం ఇచ్చేది ఎప్పుడో ..!

ఎదురుచూస్తున్న మత్స్యకారులు

జాప్యంపై జాలర్ల అసంతృప్తి

చీరాల, ఆగస్టు 9 : సంధికాలం సమయంలో ఇచ్చే భత్యం కోసం మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. గతంలో రూ.10వేలు మాత్రమే ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో భాగంగా ఆ మొత్తాన్ని రూ.20 వేలు చేస్తామని హామీ ఇచ్చింది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14తో సముద్రంలో వేట నిషేధిత సమయం పూర్తయ్యింది. కాని అర్హులైన మత్స్యకారుల ఖాతాల్లో సంధికాలపు భత్యం ఇంకా జమ కాలేదు. ఇదిలా ఉంటే గతంలో మాదిరిగా రూ.10వేలు ఇస్తారా, లేకుంటే రూ.20వేలు ఇస్తారా అనే విషయంపై గంగపుత్రులు చర్చించుకుంటున్నారు. జాప్యంపై జాలర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 74 కిలోమీటర్ల తీరప్రాంతం ఉంది. మత్స్యకార గ్రామాల ప్రజల్లో ఎక్కువ మందికి వేటే జీవనాధారం. మగవారు వేటాడిన మత్స్య సంపదను మహిళలు విక్రయాలు చేస్తుంటారు. సుమారు 232 మెకనైజ్డ్ బోట్లు, 2,431 మోటర్ బోట్లు, 247 సంప్రదాయ కర్ర తెప్పలు ఉన్నాయి. వీటిపై సారంగులు, కళాసీలు సుమారు 20వేల మంది వరకు ఉపాధి పొందుతుంటారు. సముద్రంలో సంధికాలం సమయంలో మత్స్యకారులు సాధారణంగా వలలు, బోట్లు మరమ్మతులు చేసుకుంటుంటారు. కొందరు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల్లో కొనసాగుతుంటారు. తప్పని పరిస్థితి అయితే బోటు యజమానుల వద్ద అప్పు చేస్తారు. లేదా ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తుంటారు. ఈ క్రమంలో సంధికాలం సమయంలో తాము చేసుకునే వలలు, బోట్ల మరమ్మతు పనులను కూడా ఉపాధిహామీ పథకంలో చేర్చితే ఎంతో ఉపయోగంగా ఉంటుందని మత్స్యకార ప్రతినిధులు కోరుతున్నారు.


తీరంలో నిలిపిన బోట్లు (ఫైల్)

కొనసాగుతున్న వడపోత

ఈ ఏడాది లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది జాబితా వివరాలు సేకరించారు. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయంపై చెల్లింపుల ప్రక్రియ ఆధారపడి ఉంటుందని అధికారులు చెప్తున్నారు.


మేదరమెట్లలో సీఐశివరామకృష్ణారెడ్డి సమక్షంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న సింథైట్ ప్రతినిధులు

కోరు రాకుండా చర్యలు తీసుకుంటాం

సీఐ, గ్రామస్థుల సమక్షంలో సింథైట్ యాజమాన్యం హామీ

మేదరమెట్ల, ఆగస్టు 9: సింథైట్ ఫ్యాక్టరీ నుంచి గ్రామస్థులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అన్నిచర్యలు తీసుకుంటామని, కోరు వచ్చే విభాగాలను పరిశీలించి అవసరం అయితే మూసివేస్తామని సింథైట్ ఆపరేషన్ హెడ్ హెల్‌తో కోమా అన్నారు. శుక్రవారం అద్దంకి రూరల్ సీఐ కార్యాలయంలో సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్‌ల సమక్షంలో మేదరమెట్ల గ్రామస్థులు, సింథైట్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఫ్యాక్టరీ ఏర్పాటు నుంచి కోరుతో తాము పడిన అవస్థలు గురించి వివరించారు. పలుమార్లు కంపెనీ ప్రతినిధులు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదన్నారు. ఎట్టి పరిస్థితులలో కోరును అనుమంతించేది లేదన్నారు. ఆరోగ్యాలను పణంగా పెట్టి మీ ఫ్యాక్టరీని నడుపుకోవడానికి అనుమతించమని గ్రామస్థులు తెలిపారు. ఇన్ని రోజులగా అనుమతులు లేకుండానే మిరప వ్యర్థాలను వాడి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేశారన్నారు. గతం అ యిపోయింది, ఇప్పుడు ఫ్యాక్టరీలో కోరు వచ్చే మిరపకాయల గ్రైడింగ్ వద్ద కోరు రాకుండా అవసరం అయిన చర్యలు చేపడతామని, అందుకు నెల రోజులు సమయం ఇవ్వాలన్నారు. ఫ్యాక్టరీ నడిపేటప్పుడు కోరు వస్తే గతంలో పరిస్థితులు పునరావృతం అవుతాయని గ్రామస్థులు స్పష్టం చేశారు. కోరు రాకుండా భద్రతా పరమైన చర్యలు తీసుకున్నాక కూడా కోరు వస్తే ఆ విభాగాన్ని మూసి వేస్తామని, రాతపూర్వకంగా కలెక్టర్‌కు, గ్రామస్థులకు రాసిస్తామని హెల్‌తో కోమా తెలిపారు. ఆయనతో పాటు మనోహర్ అనే మధ్యవర్తి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆ యనకూడా రాతపూర్వకంగా ఇస్తున్నారు కాబట్టి కోరు వస్తే చర్యలు తీసుకుందామని గ్రామస్థులతో అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మేదరమెట్ల శ్రీనివాసరావు, మద్దాళి సంజీవరావు, రవ్వవరపు బ్రహ్మయ్య, చావా రాజేష్, ఆదూరి ప్రసాద్, మేదరమెట్ల చిన్న, శ్రీధర్, బోయపాటి శంకర్, పోకూరి హరి, కరుమూరి ప్రసాద్, కిలారు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించుకుందాం

- ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), ఆగస్టు 9 : సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించుకుందామని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య చెప్పారు. మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ సిలోన్ కాలనీ ముత్తు మరియమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం కాలనీవాసులు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే కొండయ్యను ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిద్ధి వెంకట బచ్చేశ్వరరావు, నాశిక వీరభద్రయ్య, భక్తులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పూర మస్తాన్‌రావు చారిటబుల్ ట్రస్టు రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఏరియా వైద్యశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.


ముత్తు మరియమ్మ ఆలయం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య


ఎమ్మెల్యే కొండయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన తహసీల్దార్ గోపికృష్ణ, సీఐ శ్రీనివాసరావు

పారదర్శకంగా పనిచేయండి

నిబద్ధతతో పాటు పారదర్శమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య తనను కలసిన అధికారులకు సూచించారు. చీరాల మండల తహసీల్దార్‌గా నియమితులైన గోపీకృష్ణ, వన్‌టౌన్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మారీదు శ్రీనివాసరావులు శుక్రవారం వేర్వేరుగా ఎమ్మెల్యే కొండయ్యను క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కలను అందజేశారు. ఆయా సందర్భాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ అంకితభావంతో పనిచేయటం మన ధర్మమన్నారు. అప్పుడే ప్రజల మన్ననలు పొందగలుగుతామన్నారు. అందుకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

పంటలు తొలగించి వరి సాగు చేసుకుంటాం

● వ్యవసాయ అధికారులకు తెలిపిన రైతులు

బల్లికురవ, ఆగస్టు9: మండలంలోని ముక్తేశ్వరం, చెన్నుపల్లిలలో పంట పొలాలను వ్యవసాయ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఇప్పటికే కంది, మొక్కజొన్న సాగు చేసినప్పటికి సాగుకు నీరు విడుదల జరుగుతున్నందున పంటలను తొలగించి వరి సాగు చేసుకుంటామని రైతులు తెలిపారు. గత ఏడాది లాగా సాగు నీరు రాదని మెట్ట పంటలు సాగు చేశామని తెలిపారు. మొక్కజొన్నలో మొవ్వ పురుగు గమనించి మొవ్వలో కారబోఫ్యురాన్ 3 జి గుళికలు ఎకరాకు 3 కిలోలు చొప్పున వేసి నివారించుకోవాలని మండల వ్యవసాయఅధికారి కుమారి సూచించారు. కత్తెర పురుగు ఉనికి గమనించడానికి ఎకరాకు 5 లింగాకర్షక బుట్టలు పెట్టుకోవాలన్నారు. వీఏఏలు రోజా, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి, వీఏఏలు

పోలేరమ్మ గుడి పునఃప్రతిష్ఠ

యద్దనపూడి, (మార్టూరు) ఆగస్టు9: యద్దనపూడి మండలం వింజనంపాడు గ్రామంలో శుక్రవారం పోలేరమ్మ గుడిపునః ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. గ్రామస్థులు,పలువురు దాతల సహకారంతో దాదాపుగా 30 లక్షలు రూపాయలు వ్యయంతో నూతనంగా గుడి నిర్మాణం చేశారు.ఈ సందర్భంగా ఉదయాన్నే దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు, యజ్ఞయాగాదులు నిర్వహించారు. దేవాలయంలో పోలేరమ్మ తల్లి, పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు పాల్గొని దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ అర్చకులు పిచ్చయ్య శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం భారీగా అన్నదానం నిర్వహించారు.


పోలేరమ్మ తల్లి గుడి ప్రతిష్ఠలో ఎమ్మెల్యే ఏలూరి

నేడు జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి విగ్రహావిష్కరణ

హాజరుకానున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 9: విద్యాదాత, మానవతావాది జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి విగ్రహావిష్కరణ కారంచేడు గ్రామంలో శనివారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పద్మవిభూషణ్ గ్రహీత భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకటయ్య నాయుడు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత లోక్‌సభ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవి కుమార్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు, మాజీ మంత్రులు డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కామినేని శ్రీనివాసరావులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


కుప్పుస్వామి విగ్రహం

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు

● మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి


కార్మికులకు డస్ట్‌బిన్‌లు పంపిణీ చేస్తున్న కమిషనర్ చక్రవర్తి

చీరాల, ఆగస్టు 9 : పట్టణంలో పారిశుధ్య చర్యలకు సంబంధించి ఎక్కడా ఎలాంటి ఫిర్యాదులు అందరాదని, అలసత్వం వద్దని మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి కార్మికులకు, శానిటరీ మేస్త్రీలకు స్పష్టం చేశారు. స్థానిక ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలోని ఓపీటీలో శుక్రవారం పారిశుధ్య కార్మికులకు బిన్‌లు, చీపురులు, పారలు, పుష్‌కాట్ తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల సమయం. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజల ఆరోగ్యం కాపాడే మొదటి వైద్యులు మీరే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ , ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, శానిటరీ సూపర్‌వైజర్లు, మేస్త్రీలు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

59 మందిపై కేసుల నమోదు

● రూ.1.77 లక్షల అపరాధ రుసుం విధింపు

బల్లికురవ, ఆగస్టు9: మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. విజయవాడ ఎస్ఈ ఆ ల్వాన్, ఒంగోలు డీపీఈ డీఈ వెంకటేశ్వర్లు, అద్దంకి ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, మార్టూరు డీఈ సురేంద్రబాబుల ఆధ్వర్యంలో 36 బృందాలు తనిఖీలు చేశాయి. 59 మందిపై కేసులు నమోదు చేసి 1.77 లక్షల రూపాయల అపరాధ రుసుము విధించారు.


వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

ఆర్యవైశ్య మహిళా సంఘ కార్యవర్గం ఎంపిక


నూతనంగా ఎన్నికైన మండల ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు

చినగంజాం, ఆగస్టు 9 : స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలో మండల ఆర్యవైశ్య మహిళా సంఘం ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు చుండూరి గాయత్రి ఆధ్వర్యంలో మండల ఆర్యవైశ్య మహిళా సంఘం ఎన్నికలు నిర్వహించారు. మండల ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలుగా వలివేటి జ్యోతి, కార్యదర్శిగా కోట సుచిత్ర, కోశాధికారిగా అమరా నాగాలక్ష్మీలు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా వాణిజ్య విభాగ్యం ఉపాధ్యక్షులు మోటుమర్రి రామసుబ్బారావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట శివరామకృష్ణ, టీడీపీ , ఐటీడీపీ నాయకులు బయ్యా సతీష్‌కుమార్, ఆర్య వైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



పలువురు ఎస్సైల బదిలీ

వీఆర్‌కు ఈపురుపాలెం సబ్‌ఇన్‌స్పెక్టర్

చీరాల, ఆగస్టు 9 : పలువురు ఎస్సైలను ఎస్పీ తుషార్ డూడీ బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అందులో భాగంగా చీరాల మండలం ఈపురుపాలెం ఎస్సై శివకుమార్‌ను వీఆర్‌కు పంపారు. ఆ స్థానంలో మేదరమెట్ల ఎస్సైగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను నియమించారు. వేటపాలెం మండల ఎస్సైగా పనిచేస్తున్న సురేష్‌ను ఇంకొల్లు ఎస్సైగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న వెంకటేశ్వర్లును వేటపాలెం స్టేషన్‌కు బదిలీ చేశారు.

మార్టూరు రూరల్ సీఐగా శ్రీనివాసరావు



మార్టూరు, ఆగస్టు 9 : మార్టూరు రూరల్ సీఐగా జీఎల్ శ్రీనివాసరావును నియమించినట్లు శుక్రవారం గుంటూరు రేంజ్ పోలీసు ఉన్నత అధికారులనుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఇప్పటివరకు మార్టూరు రూరల్ సర్కిల్‌కు సీఐగా సీతారామయ్య విధులలో ఉండగా ఆయనను బదిలీచేసి ఆయన స్థానంలో సీఐగా శ్రీనివాసరావును నియమించారు. ఇదిలా ఉండగా మార్టూరు రూరల్ సర్కిల్‌లో ఉన్న యద్దనపూడి, పర్చూరుస్టేషన్‌లను త్వరలో పర్చూరు సర్కిల్‌గా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

యద్దనపూడి ఎస్ఐగా రత్నకుమారి

మార్టూరు : యద్దనపూడి ఎస్ఐగా డి. రత్నకుమారిని నియమించినట్లు శుక్రవారం పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు.ప్రస్తుతం ఎస్ఐగా ఉన్న జీవీఎస్ చౌదరి బల్లికురవ ఎస్‌గా బదిలీ కాగా, ఆయన స్థానంలో రత్నకుమారి అద్దంకి నుంచి యద్దనపూడిస్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆమె గతంలోనూ యద్దనపూడి స్టేషన్ ఎస్ఐగా ఏడాదికిపైగా పనిచేశారు. తిరిగి ఆమెను యద్దనపూడి స్టేషన్‌కు నియమించారు.

పర్చూరు ఎస్సైగా సురేష్

పర్చూరు : పర్చూరు సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పి.సురేష్‌ను నియమించారు. సంతమాగులూరు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను శుక్రవారం పర్చూరుకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్.రమేష్, చినగంజాంకు బదిలీ అయ్యారు.

ఇంకొల్లు ఎస్సైగా సురేష్

ఇంకొలు : ఇంకొల్లు ఎస్సైగా ప్రస్తుతం వేటపాలెం ఎస్సైగా పని చేస్తున్న జి.సురేష్‌ను నియమిస్తూ శుక్రవారం ఎస్పీ తుషార్ డూడీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇంకొల్లు ఎస్సైగా పని చేస్తున్న మల్లికార్జునరావును వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు అందాయి.